# శాంతి

## కాళీపట్నం రామారావు

"భౌ భౌ వ్ .." అరుస్తోంది గ్రే హౌండ్.
అంటే యజమాని రాత్రి భోజనం ముగించి మేడమెట్లెక్కుతున్నడన్న మాట.
జాతి కుక్కలకి గ్రహింపు ఎంతో జ్ఞాపకం అంత.
కాలుస్తున్న బీడీ ఆర్పేసి మెట్లపక్కకి విసిరేస్తూ లేచాడు వాచ్‌మన్.
శునకజాతికి విశ్వాసం మహాజాస్తీ. చేరదీసేవాళ్ళ చనువు కోసం వాటిలో వాటికి చచ్చినంత పోటీ. ఉన్నవి మూడు గొలుసులు. ఆ మూడూ విడదీసేసరికి మూడు యుగాలౌతుంది.

ఒక్కొక్క గొలుసు విడిపోవడంతో ఒక్కో జాగిలం దూసుకుపోతోంది. క్షణకాలం తోట నాలుగు మూలలూ "భౌవ్" లతో మారుమోగిపోయింది.

వేషం గీషం సర్ది, తాళాలు టార్చీ తీసుకు బయల్దేరేవేళకు కుక్కలు ఓ రౌండ్ పూర్తి చేసుకొచ్చేయి. వాచ్‌మన్ మెయిన్‌గేటు కేసి వెళ్తుంటే కుక్కలు చలంతా లాడుతూ, తోకలూపుకుంటూ కాళ్ళకడ్డం పడుతున్నాయి. గ్రేహౌండ్‌ను తన దగ్గరుంచుకొని ఆల్సేషను వెనక్కి తరిమేశాడు వాచ్‌మన్.

సర్దేస్తారు. తలుపులన్నీ సరిగా మూసారో లేదో , తాళాలన్నీ గట్టిగా వేసేరో లేదోచూ అయ్యగారు మేడెక్కిందే తడవు – వంటమనిషి , దాసీమనిషి కింద గదులు గబ గబ మూసేక యజమానురాలు మేడెక్కుతుంది. వంటమనిషి దగ్గర తాళాలు అప్పగించు–కున్నాక దాసీ మనిషి సింహద్వారం మూసేస్తుంది.

ఎప్పుడేనా మిగిలిన పదార్థాల్ని వంటమనిషి ఓ మూటగా కట్టి తీసుకుపోతుంది. తిండి పెట్టే మనిషికదా–అనుమానం వేస్తే ఆమెని చూసి కూడా మొరుగుతుంది – ఓ ఆల్సేషన్. దాన్ని చూస్తే వంటమనిషికి అసహ్యం,
గౌరవం, ఒక్కసారిగా కలుగుతాయి.

సటప్ ముండా! – అని దాన్నో తిట్టు తిట్టి – దీని తాతగారి సొమ్ము! అనుకుంటూ మెట్లు దిగుతుంది. సింహాసనం మెట్లలాగ ఆ మెట్లు ఎంతకీ తరగవు. ఎతు! ఎత్తు పెద్దోళ్ళ బతుకంతా ఎత్తే ! – అనుకుంటుంది వంటమనిషి.

నగరంవంతా పల్లాన వుంటే, చుట్టూ గుట్టలమీద కోటల్లాంటి పెద్ద పెద్ద బంగళాలు చీకటితొలగదు.

ఊరంతటికి ఎత్తున ఉంటుంది పెద్ద గుంటుంది ఐదారెకరాల దట్టమైన తోట. ఆ చెట్ల మధ్య పాతకాలపు పద్ధతిలొ ఉంటుంది పట్టాభిరాబయ్యగారి బంగళా.

ఊరికి ఓ చివర వారి బంగళా వుంటే, రెండో చివర ఎత్తున ఉన్నట్టు కనిపిస్తుంది వారి స్టీలు మిల్లు. మూడవ అంతస్తులో వుండే అయ్యగారి ప్రవేటు రూములోంచి చూస్తే ఊరంతా వారి పాదాలముందు పరుచుకున్నట్టు కనిపిస్తుంది.

పడక గదిలో భర్త అగుపించకపోగా ప్రైవేటు రూం కోసం మెట్లెక్కుతోంది మిసెస్ పట్టాబి. ఆ గదిలో ఆధునికులకు కావలసిన సదుపాయాలన్నీ ఉంటాయి. అనుమతి తీసుకోకుండా అమ్మగారైనా అడుగుపెట్టరు.

"యస్, కమిన్" అన్న పిలుపు వినగానే పాల గ్లాసు యడం చేతిలోకి మార్చుకొని మిసెస్ పట్టాభి లోపలికెళ్లింది. ఆమెక్కూడా తెలియనంత నెమ్మదిగా ఆమె వెనుక స్ప్రింగ్ డోర్ మూసుకుంది.

తగినపుష్టి వల్ల అంత ఎత్తనిపించడు కాని పట్టాభిరామయ్య ఆరడుగుల రెండంగు-ళాల మనిషి. నలభై అయిదేళ్ళు దాటాయేమో నడుం యీ మధ్యే మోపౌతుంది. వీపూ, మూపురం, దండలు, తొడలూ ఇంకా దళసరెక్కలేదు. రంగు చామనచాయే ఒంటినిండా పెరిగిన బొచ్చువల్ల నల్లగా కనిపిస్తాడు.

హేంగర్‌నించి తీసిన నైట్ గౌన్ వేసుకుంటూ ఆయన భార్య వంక తిరిగేడు. ఒక్క క్షణం ఎవరో కొత్త మనిషి – మోటుగా బలంగా ఎవరో మగమనిషి – గర్డిల్ రోప్ ముడిపడగానే పాతమనిషి – అద్దం దగ్గర నిలబడి తల దువ్వుతున్నాడు.

మిసెస్ పట్టాభి భర్తకన్న నాలుగైదు మాత్రమే చిన్న. మూడేసేళ్ళ ఎడంలో ఆమెకు ముగ్గురే పిల్లలు. సంతానం ఎత్తికట్టేక శారీరకంగా ఆమెలో చాలా మార్పు వచ్చింది. మొదట్లో పసి నిమ్మపండులా పచ్చగా ఉండేదిట. మనిషి ఒకప్పుడు అందగత్తె కావచ్చు – ఆమె ముఖం చూస్తే యిప్పటికి ఆ ఛాయలున్నాయి. ఇప్పుడామె మెడా, పక్కలూ,

పిరుదులూ, చివరకు చేతులు సహితం స్వేచ్ఛగా బలిసిపోతున్నాయి. ఆమెకుండే చింత– లన్నిటిలోకి పెద్ద చింత – వాటినెలాగ అదుపులో పెట్టడం అన్నదే.

నున్నగా గీసిన గడ్డం, అప్పుడే దువ్విన తలతో భర్త ఎదురుగా వస్తుంటే మిసెస్ పట్టాభికి ఒక్క క్షణం గుండె దడదడ లాడింది. లేదు లేదు. ఆ రోజులు మరిరావు .. పట్టాభి ఆమెని తప్పించుకొని పక్క ద్వారం గుండా టెర్రస్ మీదికి వెళ్ళిపోయాడు.

డాబా చివర పిట్టగోడ దగ్గిర నిలబడి చూస్తే, ఊరికివతల చివర దీప మూలికల్లా కనిపిస్తాయి వారి ఫ్యాక్టరీలు. ఆ కొండవార నున్నది స్టీల్ మిల్. దానికుత్తరంగా పోలథిన్ ఫ్యాక్టరీ. ఆ చివార నున్నది బోన్ మిల్. ఇవి కాక నగరంలో అక్కడ కొన్ని మేడలు, ఇక్కడ కొన్ని షాపులు; శివార్లలో వేల గజాల ఇళ్ల స్థలాలు.

రింగ్ మీద రింగ్‌గా టెలిఫోన్ మోగుతునే వుంది. అయిదారు రింగులు కానిచ్చి అప్పుడు వెనక్కి తిరిగి వచ్చేడు పట్టాభి. మిసెస్ పట్టాభి ఫోనుకు దగ్గరగానే వున్నా ఆవిడ ఫోనెత్తలేదు.

ఆయన ఫోనెత్తేక హాలో! అనడంలో ఇక ప్రత్యేకంవైన తీరుంటుంది. అది విన్నాక ఎవరుగాని – ఆయన్ని, 'ఎవరు మీర'ని అడగక్కర్లేదు.

"హాలో!" అన్నాక, "ఆఁ" అన్నాడు పట్టాభి.

ఫోను మీద అవతలిగొంతు చాలా వినయంగానే వుంది. అయినా ఆయనగారి మొహం ఓ క్షణం నల్లబడింది. వెంటనే తెచ్చిపెట్టుకున్న నవ్వుతో మొహంవెత్తి ఓసారి భార్యవంక చూసేడు. ఎదుటివాళ్ళు సూటిగా కళ్లల్లోకి చూస్తే కొందరికి మంటెత్తుకొ స్తుంది. మొహం గంటు పెట్టుకొని ఫోన్‌కేసి తిరిగేడు పట్టాభి.

మిసెస్ పట్టాభికీ ఉన్నాయి కడుపులో మంటలు. అయితే వాటిని ప్రకటించి లాభం లేదు. ఆ సంగతి ఆవిడ తెలుసుకుని చాలా కాలంవయింది. భార్య గది విడిచి పోగానే ఒక్కసారి మండిపడ్డాడు పట్టాభి.

"లెట్ హెర్ వెయిట్ – యిక్కడెవరూ గుడ్డి గుర్రానికి పళ్లు తోంవటం లేదన్చెప్పు. ఈ సారి ఫోన్చేస్తే మాటాడక. రిసీవర్ పెట్టెయ్–"

ఆ తరువాత అవతల మనిషి ఏం చెప్పేది పూర్తిగా వినకుండానే రసీవర్ పెట్టేసేడు.

ఒక్క క్షణం పట్టాభికి మనసంతా తిమ్మిరెక్కినట్టయింది. ఆ తిమ్మిర్లో సిగరెట్ జ్ఞాపకం వచ్చింది. ఓ సిగరెట్ వెలిగించి రెండు పఫ్‌లు పీల్చేసరికి తిమ్మిరంతా క్రమంగా సడలిపోయింది.

ఫోను నెమ్మదిగా డయల్ చేసి ఆన్సరు కాగానే అడిగాడు – "మాట్లావేఁవిటి?"

ఫోను భయం భయంగా, భకి భక్తిగా గొరగొర లాడింది.

"వద్దులే" అంటూ మంచం దండె మీద కూర్చున్నాడు.

ఫోనులో చాలా వినయంగా వచ్చే గొంతు అతి వినసొంపుగా వుంది. మంచం మెత్త మెత్తగా ఇచ్చే సుఖం చాలా హాయిగా వుంది.

"అదలా అరుస్తూనే ఉంటుంది – పట్టించుకోక, ఒట్టి బెదురుగొడ్డు" అన్నాడతను. "మరీ పిరిగ్గుంట" అన్నాడు ఇంగ్లీషులో.

ఆ రెండు ముక్కలూ అన్నాక అవతల మనిషి ఏం చెప్తున్నాడో పట్టాభికి వినిపించడం లేదు.

దూరాన 'సన్ – ఎన్ – సేండ్' లో పెద్ద పెద్ద అతిధుల కోసం ప్రత్యేకంగా కట్టిన గదులు. ఆ గదుల్లో ఓ గది నడుమ ' ది గ్లయిడింగ్ ఫ్లేమ్' విసుగ్గా పచార్లు చేస్తోంది.

షేడెడ్ లాంప్స్ వెలుతురులో ఆ గది చీకటిగాను, సీలింగ్ దీపాల వెలుతురులో 'జ్వాలిక' రంగుల మతాబూలానూ వుంది. ఆ పట్టున అతణ్ణి చుట్టుకున్న ఆ గొడవేలేప్పోతే ఆమెను విసిగిస్తున్న మెరూన్ సిల్క్ శారీని ఆమెకై మడతలు పెట్టేవాడు పట్టాభి.

టెలిఫోన్ క్లిక్ మనగా 'సన్–ఎన్–సేండ్' లోంచి సరాసరి వచ్చి ఈస్టర్న్ గార్డెన్స్ మధ్యల ప్రైవేట్ రూంలో పడ్డాడు. తన మనసలా క్షణకాలమైనా చెదిరిపోయి–నందుకు పట్టాభిరామయ్య గారికి చాలా చిరాకు వేసింది.

పట్టాభిరామయ్యంటే, నిన్నా మొన్నా రోడ్డు కాంట్రాక్టులూ, బ్రిడ్జి కాంట్రాక్టులూ పట్టుకొని, అయిదు పదేళ్లయేసరికి మోటారు సైకిళ్లొదిలి ఫియట్ కారుల్లోకి దూకే బట్ట

తలపాగాల బుచ్చప్పారావులూ, బ్లేజర్‌కోట్ల అప్పల్నాయుళ్ళూ కాదూ. పట్టాభి వాళ్లది కల్తీ లేని వాణిజ్యవేత్తల కుటుంబం. క్రమశిక్షణ వాళ్లకు వెన్నతో పెట్టిన విద్య.

అయితే ఆయన మాత్రం ఒక రంగంలోంచి యింకో రంగంలోకి షిఫ్టవలేదా అంటే అయ్యేడు.

వాళ్ల తాతగారు అప్పట్లో పుర శ్రేష్ఠుల్లో వణిక్ప్రముఖులు. వాళ్ల నాన్నగారు కూడా కొంతకాలం కలప వ్యాపారమే చేసేరు. చేసేక ఒక సినిమా హాలు, రెండు టెర్మ్‌లు ఛైర్మన్ గిరి సంపాదించేరు. ఆ హోదాతో ఆయన రోటరీ కుటుంబసభ్యుడయ్యేడు.

పట్టాభిరామయ్య బాలప్రాయం గడిచి వ్యక్తుడయ్యేసరికి, వాళ్ల కుటుంబ స్థితీ, హోదా బాగా పెరిగేయి. అప్పట్లో ఆయన ముందు మూడు ముఖ్యమైన మార్గాలు కనిపించేయి. అంతవరకు ఆషామాషీగా పాల్గొంటున్న రాజకీయాల్లో గట్టిగా చొరబడిపోయి, రాబోయే దేశ స్వాతంత్ర్యాన్ని వేగం తెచ్చీడం ఒకటి.

రాజకీయ స్వాతంత్ర్యం కన్నా ముఖ్యమైనది ఆర్థిక స్వాతంత్ర్యం. ఆర్థిక స్వాతంత్ర్యాని కి కీలకం పరిశ్రమల్లో వుంది. అరవాళ్ళతో పోల్చినా ఆంధ్రావాళ్ళు ఏడు పురుషాంత రాలు వెనక ఉన్నారు. పారిశ్రామిక రంగంలో ప్రవేశించి 'ఆంధ్రా పయొనీర్' కావడం రెండోది.

చిత్రసీమలో చూస్తే తెలుగు కళామతల్లికి హిందీ చిత్ర సరస్వతికుండేపాటి గౌరవమై నా లేదు. అందులో ప్రవేశిస్తే డబ్బుకి డబ్బూ ఆర్జించొచ్చు. కళాసేవ చేసేడన్న కీర్తీ సంపాదించొచ్చు. ఒకే దెబ్బకి రెండు పిట్టలు.

పట్టాభిరామయ్యకు ఎలా తెలిసిందో మొదటిది ఎత్తయినదే అయినా, తన ఎత్తుకు తగనిదీ, స్వభావానికి పడనిదీ అని తెలుసిపోయింది. చివరిది మరీ బోకుగాళ్ళు కనవలసే పగటి కల. వెళ్తే రెండో దార్నే వెళ్లాలనుకున్నాడు బాలపట్టాభి.

దానికితోడు ఆయనకు దొరికిన మాంవగారు బాగా గట్టిపిండం. ఆయనగారు కోస్తా జిల్లాలకు చెందిన ధాన్యం వ్యాపారి. పేరుపొందిన పంచదార ఫ్యాక్టరీలో ఆయనకు

పెద్ద మొత్తం వాటాలున్నాయి. అది కారణంగా దొంగిలించే దానికన్నా దోచితే చిక్కేది ఎక్కువని తెలుసుకున్నాడు. ఆ సంగతి అతను అందరితోను చెప్పదలుచుకోలేదు. దగ్గిరవాళ్లనూ, అతి దగ్గరివాళ్లనూ, వ్యాపారరంగం నించి పరిశ్రమల్లోకి తరలమని పదేపదే బలవంతం చేసేవాడు.

అప్పట్లో కొన్ని విదేశీ పరిశ్రమలు అమ్మకానికికొచ్చేయి. 'ఇవాళ దేశానికి స్వాతంత్ర్యం వస్తోంది; రేపే దీన్న సోషలిస్టు కంట్రీ చేసేస్తాం' అన్నట్టు మాటాడేది నాయకత్వం. ఆ ఆర్భాటం చూసి, నిజమే అని నమ్మలేదు విదేశస్థులు. నమ్మినట్టు నటించి కొందరు కొన్ని కొన్ని వ్యాపారపు చిక్కులు నేర్పుగా తొలగించుకున్నారు.

దేశ విభజన కారణంగా జూట్ ఇండస్ట్రీ చిత్రమైన స్థితిలో పడింది. తల తూర్పు బెంగాల్ కీ, మొండెం పశ్చిమ బెంగాల్ కీ ఒకే పశువుని ఇద్దరు అన్నదమ్ములు పంచుకున్నట్టు – పరిశ్రమ విడిపోయింది.

దాని ప్రభావం బెంగాల్ పరిశ్రమతో ఆగలేదు – ఇక్కడ కూడా ఆ పరిశ్రమ మీద పడుతుంది. అంచేత 'ద రోవర్స్ అండ్ గ్రోవర్స్' కంపెనీ యజమానులు తమ జూట్ ఇండస్ట్రీని బేరానికి పెట్టేరు.

పట్టాభిరామయ్య మావగారు, అలాటి అవకాశం మరిదొరకదు–అన్నాడు. అనుభవం లేని అయ్యగారు ఇల్లు కట్టడం కన్న కొనడం మంచిది. అల్లుడికొచ్చిన వాటా చాలక పోతే, తన సొమ్ము కొంతా, తన పనపతి చాలానూ ఉపయోగించి ఆ బేరం ఖాయం చేసేడు.

ఆ ఊబిలోనుంచి బయటపడేసరికి పట్టాభికి తల ప్రాణం తోక కొచ్చింది. అయితే బతకవలసే జీవికి బాలారిష్టాలు చేసే మేలు ఇంతా అంతా కాదు. లక్ష తయ్యారీలూ, వాక్సీనులూ చెయ్యలేని పని ఒక్క జబ్బు చేయగల్దు గదా, ' ద రోవర్స్ అండ్ గ్రోవర్స్ జూట్ మిల్ ' ప్రసాదించిన అనుభవంతో పట్టాభి పారిశ్రామిక రంగానికి సంబంధిం చిన అన్నిరకాల వ్యవహారాల్లోనూ పండిపోయేడు.

ఇండస్ట్రీలో నెగ్గాలంటే అన్నింటికన్నా పుష్కలంగా వుండవలసింది 'కేపిటల్'. ఫీల్డ్‌లో మొదటి పాదం మనదైతే అంత కేపిటల్ లేకపోయినా కొంత తట్టుకోవచ్చు. 'పోటీ' పోటీ తలెత్తకముందే నువ్ పెరిగాపోవాలి. అదీ అప్పట్లో అతని సూత్రం.

దేశంలో పెట్టుబడి మొత్తానికి 'చలీ–కుదుపు'గా ఉండే రోజులవి. ఏ నాయకుడు నోరు విప్పినా దీనజనోద్ధరణా, సాంఘిక అసమానత్వం గురించే మాటాడతాడు. పంచడానికి దరిద్రం తప్పితే ఈ దేశంలో ఉన్న సంపదేఁవిటి? ఈ సంగతి ఒక్కడూ ఆలోచించడు. చీవూ–నెత్తురూలా చెఁవటోడ్చి కూడబెట్టిన డబ్బు – నిరుపయోగంగా వుంచడం యెందుకని – ఏ పరిశ్రమమీదో పెడితే, నష్టపరిహారం కూడా ఎగ్గొట్టి, ఎప్పుడు నేషనలైజ్ చేసేమంటారో తెలీదు. అంచేత పరిస్థితి గమనిస్తారే తప్ప వున్న వాడెవడూ ఎంత ఉత్సాహం ఉన్నా పరిశ్రమకు కాణీ కదపడం లేదు.

అదే అదనని పట్టాభి వంటివారు కొందరు చొరవ చేసేరు.

ముందుగా 'ఉత్తరాంధ్ర షుగర్ వర్క్స్', ఆ తరువాత 'ఆర్ అండ్ అర్ స్టీల్ ఫౌండ్రీ; ఆపైన దేవదేవీ పోలీథిన్స్; ఇలా రెండేసి మూడేళ్లకి ఒక కొత్త ఇండస్ట్రీ ఎక్కడైతే పోటీ వుండదో అక్కడ, ఏ రంగం కొత్తదైతే ఆ రంగంలో – లేపుతూ వచ్చేడు పట్టాభిరామయ్య.

అతడి గెలుపులో కిటుకెక్కడుందో తెలిసేది కాదు. ఆయనగారికి రాజకీయాల్లో పదవుల్లేవు. కాని అతడేది తలపెట్టినా తలతో చేసి తరించడానికి ప్రభుత్వంలోనూ దాని యంత్రాంగంలోనూ ఎక్కడికక్కడ మనుషులున్నారు. ఆయనున్నాడంటే ఎందుకు, దేనికి అనకుండా ఎంత కావలిస్తే అంతా పెట్టుబడి పుడుతుంది. మొదట్లో అతన్ని ఎద్వంచ–రిస్ట్ అన్నవాళ్ళే తర్వాత అతని ప్రాపుకోసం పడిగాపులు పడ్డారు. ఆ తరువాత సహాయమూ పొందేరు.

పట్టాభిరామయ్య తను నడిపే పరిశ్రమలన్నీ సొంతమే అవాలనుకోలేదు. కొన్నింటిలో తనకి వాటాలుంచేడు. మరి కొన్నింటిలో నామమాత్రపు వాటాలు, తన పేరూ వుంచేడు. కొన్నింటికి అతను డైరెక్టర్. మరికొన్నింటికి మేనేజింగ్ పార్టనర్. ఒకటి మాత్రమే అతని సొంతం.

అయితే ఏ కంపెనీకి ఎవరు యజమానులున్నా, అన్ని కంపెనీలను మేనేజ్ చేసేది పట్టాభిరామయ్యే. ఆయన కంపెనీలుండే మూడు మహానగరాల్లోనూ ఆయన చేతి కింద మూడు పెద్ద బంగళాలువున్నాయి. మూడింట్లోనూ కలిపి మొత్తం ఎనిమిది పెద్ద సైజు కార్లున్నాయి. ఇంటా బయటా అతని లెటర్ హెడ్డో, విజిటింగ్ కార్డో చేత పుచ్చుకున్నవారు ఎంత పెద్ద వాళ్లయినా సైజు తగ్గి, ఇంత చిన్నవాళ్లయిపోతారు.

సామ్రాజ్యాలు స్థాపించడం కష్టం కాదు. ఏలడంలో ఉంది అసలు కష్టం. వికేంద్రీ–

కరణ ఎంత చేసినా భారీ భుజాలమీదే భారం ఎక్కువగా పడుతుంది.

పట్టాభిరామయ్య వంటివారు బరువులకు జంకరు. ఇదే ఇంకో దేశంలో అయితే ఇంతకు పదిరెట్లు బరువు మోయగలడు. ఈ దేశంలో వుండే దౌర్భాగ్యం ఏమంటే పరిశ్రమలకు తగిన రక్షణ లేకపోవడం.

..మెడిల్‌సమ్ మెటిల్డాలా ప్రతి ప్రభుత్వమూ తనకు తెలియని ప్రతి విషయంలోనూ వేలు పెడుతుంది. ఈ దేశంలో అయితే పరిశ్రమల్లో కాస్త భారీగా తల కూడా పెడు తుంది. డెమాక్రటిక్ దేశాల్లో పగ్గాలన్నీ ప్రభుత్వం చేతిలోనే వుండవు కదా? అదొక్కటే ఉన్నంతలో కొంత సుగుణం.

..అలాగే కూర్చునే కొమ్మను నరికే జాతి అన్ని కాలాల్లోనూ, అన్ని దేశాల్లోనే ఉంది. ఉంటుంది. ఈ దేశం ప్రత్యేకత ఏమిటంటే దాని నాయకత్వానికి ఇంకో దేశం నుండి ఆదేశాలు రావాలి. దేశంలో మాబాక్రసీ మండిపోతుంది. ప్రభుత్వాల మనుగడ పెంట మనుషుల చేతుల్లోనూ, పెద్ద మనుషుల ధన ప్రాణ మానాలు ఆ ప్రభుత్వం చేతిలోనూ చిక్కుకున్నాయి.

..ఇలాంటి ప్రతికూల పరిస్థితులలో పరిశ్రమలు పెంచాలంటే మాటలు కాదు. వెర్రిలోనైనా ఒక క్రమం ఉంటే నిగ్రహించవచ్చు. జనంలో ఎక్కడ చూసినా అశాంతి. ప్రభుత్వం ఏ రాష్ట్రంలో చూసినా అస్థిరం. ఏ క్షణంలో ఏ శాసనం పుడుతుందో కర్తలకే తెలీని స్థితి.

మంచి కార్యశూరుడు దేనికీ ఇతరులమీద ఆధారపడడు. మంచి యజమాని అన్నిటికీ ప్రభుత్వాలకేసి చూడడు. పట్టాభిరామయ్య అశాంతి మధ్యే ఓ విధమైన శాంతి ద్వీపం సృష్టించుకోదలిచేడు.

ఒకటి తర్వాత ఒకటి ఒక్కొక్క కంపెనీ యాజమాన్యం స్వయంగా వహిస్తూ దాదాపు అన్ని కంపెనీల పనివాళ్లనూ ఒక కొలిక్కి లాక్కువచ్చేడు. ది ఆర్ అండ్ ఆర్ స్టీల్ మిల్స్ ఒక్కటే అతనికి కొరుకుడు పడలేదు.

ఆ కంపెనీ ఆదినుండీ అతని చేతిలోనే వుంటే ఇంత గొడవ లేకపోను. ఫౌండర్ మెంబర్స్‌లో ఆయన కూడా ఒకడు. పుట్టినపుడు అదో చిన్న ఫౌండ్రీ.

ఆ ఫీల్డ్‌కుండే ప్రాముఖ్యతనుబట్టి దానంతటదే పెరిగి పెద్దదయింది. లోగడ మేనేజ్

మెంట్ ఎంత అవకతవకగా నడిపినా అది బతికి బట్టకట్టింది. పబ్లిక్ సెక్టార్ లో పోటీ తగిలే సూచన కనిపించగానే దాని యాజమాన్యం పట్టాభి కాళ్లు పట్టుకున్నారు.

ఒకసారి రంగలోకి దిగేక ఆయన దాని అంతు చూడందే వదలడు. కిందపెట్టి మీద పెట్టి నాయకుల్నీ, ప్రభుత్వాన్నీ అదరగొట్టగలిగేడు. తన చేతికింద పనివాళ్లని మాత్రం చేతికిందకు తేలేకపోయాడు.

యూనియన్ యూనియన్‌కీ ఇద్దరు ముగ్గురు నాయకులు. ఈ కంపెనీలో రెండు యూనియన్లకూ ఒక్కడే నాయకుడు.

ఆ నాయకుడైనా ట్రేడ్ యూనియన్ సంప్రదాయాల్లోంచి పెరిగినవాడు కాదు. కుర్రపీరు. కొత్త పూజారి. ఏ పార్టీకో అంటిపెట్టుకున్నవాడైనా ఇంత ఇబ్బంది లేకపోను. ఏ బంధనాలూ లేకపోవడంవల్ల మొత్తం యూనియనంతా ఒక్కటిగా అతని వెనక ఉండడంవల్లా ఆ మనిషి బంటుకాపు శకటులా, గొంతులో పుండులా, ఒంటిని పట్టిన పీడలా వేధిస్తున్నాడు.

ఇప్పటికి నాలుగైదేళ్లయింది కంపెనీని చేతిలోకి తీసుకుని. కంపెనీ పెరిగింది. యూనియన్ మాత్రం చేతిలోకి రావడం లేదు. అదొస్తే చేయగలిగేది చాలా వుంది.

తెలివైన ఏ యజమాని అయినా లేబర్‌పట్ల ఎల్లవేళలా ఒకే పాలసీ అవలంబించడు. ఆ చదరంగం ఆడ్డానికి చాలా నేర్పు కావాలి. ఎత్తులైతే తనకు తెలుసు. ఆలోచించ–డానికీ, ఆచరణలో పెట్టడానికీ తగిన వ్యవధే వుంటే ఇలాంటి కుర్రపీరుల్ని వంద–మందిని తోసి రాజనగలడు. తనున్న పరిస్థితిలో తనమీదుండే ఒత్తిళ్లలో ఏం ఆలో చించడానికీ, అతనికి వ్యవధి చాలడం లేదు. ఎదిరికి తనొక్కడూ, తనకు ఎదురు వందమంది.

అసమానుల మధ్య ఈ పోరాటంవల్లే అప్పుడప్పుడూ అలసట మరీ పెరిగినప్పుడు అతని బుద్ధి ఇలా హోటల్ గదులలోకి, అక్కడ ఆడవాళ్ల దిసమొలల చుట్టూ పరు–గులు తీస్తుంది.

మనసు చిక్కబెట్టి అదుపులో పెట్టడానికి అతనో పద్ధతి అవలంబిస్తాడు.

సిక్స్ బై ఫోర్ మహాఘనీ టేబుల్ – దానిమీద నున్నగా శుభ్రంగా పిరచిన గాజు పలక, కూచునేందుకు మెత్తని రివాల్వింగ్ ఛైర్, ఎదురుగా ఖరీదైన స్టేషనరీ,

సంతకాలు కావలసిన కాగితాలు పాడ్‌లలో వున్నాయి. ఆనాడు చూడవలసిన ఫైల్సూ అర్జంటుగా అటెండు కావలసిన కరస్పాండెన్స్ ఆ పక్కనే అమరి వున్నాయి. ఆ టేబుల్ ముందు కూర్చున్నాడు పట్టాభిరామయ్య. అయితే ఆ శరీరానికి హాలీడే ఇచ్చి ఎన్నాళ్లవుతుంది? అది కూడా ఆలోచించవలసిందే కదా! జ్ఞాపకం వున్నంత మేరిక స్వేచ్ఛగా మంచి విస్కీ తాగీ, గుండెల్నిండా చార్మినార్‌లాంటి ఘాటైన పొగపీల్చి కొన్ని నెలలైనట్లుంది. చాలామంది 'కోమల పురుషు'ల్లా అతను శరీరపు అలసట గురించీ, దాని చిన్న చిన్న రోగాల గురించీ బేజారెత్తే రకం కాదు. అయితే ఆ మధ్య ఓసారి కళ్లు బైర్లు కమ్మేయ్. ఎన్ని సెకన్లో గుర్తు లేదు! కొంతసేపు తెలివి కూడా లేదు. ఇదంతా ఎప్పుడు – కారు డ్రైవ్ చేసూండగా.

లక్కీగా రోడ్డు నిర్మానుష్యం – పట్టపగలు, తిన్నని రోడ్డు. తెలివొచ్చేక ఒక్క క్షణం గుండె ఆగినంత పని అయింది. డాక్టర్‌తో చెప్పడమా మానడమా? కాజువల్‌గా రెడ్డితో అన్నాడు.

చేతిలో పేక పారేసి అప్పటికప్పుడు కారెక్కించేడు రెడ్డి. ఓ గంటసేపు నర్సింగ్ హోమ్‌లో నానా హంగామా – "బతికించావ్ ఫో! అయినా నా మాట విను. నీలాంటి వాళ్లకు ముందు జాగ్రత్తగా మూడు పత్యాలు చెప్పాలి".

"సుబ్బరంగా తినడం, చిత్తుగా తాగడం, నెలకోసారి మంచి పిల్లను తీసుకోవడం. ఈ మూడింటినీ ఎప్పుడూ అశ్రద్ధ చేయకు. నేచెప్పే మందులు నువ్ ఎలాగూ వాడవ్. రుచ్యమైన ఈ పథ్యాన్ని కూడా నువ్ అశ్రద్ధ చేసేవో నిన్ను దేవుడు కూడా రక్షించలేడు" అన్నాడు రెడ్డి సీరియస్‌గా.

రెడ్డి అందర్లాటి డాక్టరు కాదు. అందుకే అతనిది రోరింగ్ ప్రాక్టీస్. పట్టాభికీ పథ్యం కొత్తగాదు. కాకపోతే దానిపట్ల గౌరవం లేదు. లేకపోవడానికి కారణం అరుచి కాదు. ఆ రుచిలో ఏదో అసహ్యం వుంది. స్వంత శరీరానికేనా లొంగిపోవడం అతని తత్వానికి పడదు. అయితే తప్పనప్పుడు అతడు దేనికీ జంకడు. సర్వైవల్ ముందు! దాని తర్వాతే సిద్ధాంతాలన్నీ. ఫోను గణ గణ లాడగా, చేస్తున్న సంతకం (కూడా) సగంలో ఆపి ఫోనందుకున్నాడుపట్టాభిరామయ్య.

"హలో" అన్నాక ఈసారి అతడి గొంతు మారిపోయింది.

డిస్ట్రిక్టు కలెక్టర్ సి.యస్.రావు ఆ అర్ధరాత్రివేళ పిలవొచ్చని ఆయన వూహించలేకపోయాడు. ఆ గందరగోళం ఓ క్షణంపాటు అతడికో చిన్న కుదుపిచ్చింది.

“నో .. నొ .. నో .. షూర్ .. షూర్ ..” అంటూ బండిని నెమ్మదిగా నిలబెట్టేడు.

అప్పుడే అంటే అరగంట క్రితం – ఏదో కేంపునుంచి తిరిగొచ్చాట్ట. వ్యవహారం సంగతే మర్చిపోయేడు. మర్నాడు పదకొండు గంటలకు అప్పాయింట్‌మెంట్ – ఆ సాయంకాలం ‘తీరికేనా?’ అంటాడు.

ఎందుకో తెలియదు. అయినా ‘తీరికే’ అన్నాడు పట్టాభి. టీకి జాయినవ్వాలిట. ఐదుగంటల కింకో ఎంగేజిమెంటు వుందన్నాడు. అయితే ఐదు గంటల్లోపే రావచ్చుట. కలెక్టరు బంగళాకు టీకి వెళ్లడం తనకు నామోషీ అనికాదు. దేనికో గాలం వేస్తున్నాడు. అలాగే అన్నాక అది బైటపడింది.

“మాట్లాడ్డానికి మీరు స్వయంగా రావడం మంచిదేమో – అలా అయితే మీకు చాలా ఇబ్బందా?”

“నో .. నో .. నాట్ ఇన్ ది లీస్ట్. నేనే వస్తాను” అన్నాడు.

“ఇచ్చి పుచ్చుకో” అన్నాడు అనుభజ్ఞుడు. రెండు ఫేవర్లకి తను ఒప్పుకున్నాడు. రేపతడేం చేస్తాడో చూడాలి. బయట నువ్వెంత పెద్దవాడిడైనా, నీకెంత పలుకుబడి వున్నా, స్థానికాధికారులతో మంచిగా వుండకపోతే – బ్రిటిషువాళ్లు ఏర్పాటు చేసిన మిషినరీ – నిన్ను చాలా ఇబ్బంది పెడుతుంది.

ఫోను పెట్టేసి నిండా రెండు నిమిషాలైనా కాకుండానే మరో కాల్ వచ్చింది.

“హలో” అన్నాడు పట్టాభి. అవతలి గొంతు టక్కున దిగిపోయింది. దొంగ పడ్డ ఆర్నెల్లకు కుక్క భౌ మందిట. కలెక్టరు గారి అప్పాయింట్‌మెంటు గురించి చెబుతాడు మేనేజరు!

“డోంట్ వర్రీ, నేనే వెళ్తున్నాను. మీకు తీరికైతే రేప్రొద్దున్న లేబర్ ఆఫీసర్ని మరొక సారి కలవండి. సరిగ్గా పదీ ముప్పైకి మా యింటికి రండి”.

ఇలా అంటూనే ఫోను పెట్టేశాడు పట్టాభిరామయ్య.

ఒకటి రెండు నిమిషాల తేడాలో సరిగ్గా పదకొండూ అయేసరికి కలెక్టరాఫీసు ముందు రెండు జీపులూ, రెండు కార్లూ ఆగేయి.

పోలీసు ఆఫీసరూ, లేబరాఫీసరూ మేడ మెట్లెక్కుతుంటే ముందు కార్లో దిగిన పట్టాభి రామయ్యని రావుగారు స్వయంగా రిసీవ్ చేసుకున్నారు. మెట్లమీద మళ్లా పలకరింపులు పరిచయాలు అయేయి. నలుగురూ కలెక్టరుగారి గదికేసి నడుస్తున్నారు.

ఆఫీసు గదిముందే నించున్న విశ్వనాథం నలుగుర్నీ ఒకే చిరునవ్వుతో పలకరించేడు. తక్కిన ముగ్గుర్నీ వదిలి కలెక్టరుగారు రెండడుగులు ముందుకి వేసేరు. ఆప్యాయంగా విశ్వనాథం చేయి అందుకుంటూ 'యామ్ ఐ లేట్?' అన్నారు 'కాదే' అన్నట్టు!

కాదంటూ విశ్వనాథం తనతో వచ్చిన కుంచాలయ్యను పరిచయం చేసేడు. 'వుయ్ నో యీచ్ అదర్' అంటూ పట్టాభి విశ్వనాథంతోనూ, కుంచాలయ్యతోనూ కూడా చేయి కలిపేడు.

"ఐయామ్ సారీ. పన్నెండు గంటలకి నేనింకో కాన్ఫరెన్సుకి వెళ్లి తీరాలి. మీ పర్మిషన్ తో మీ టైం లోంచి అయిదు నిమిషాలు దొంగిలిస్తాను" అంటూ ఎదురుగా ఉన్న కాలింగ్ బెల్ రెండు రకాలుగా నొక్కేరు రావుగారు.

మొదటి బెల్‌కు ఫ్యూనొచ్చి దక్షిణ తెరిపి అద్దాల కిటికీ తెరిచి వెళ్లిపోయేడు. గాలీ వెలుతురూ బాగా గది–పెద్దగా ఫర్నిష్డ్ కాకపోయినా అందంగా వుండడం సహజం.

రావుగారు సన్నగా, పొడుగ్గా, రాచరికాలు కాలగర్భంలో దాచివచ్చిన రాజకు–మారుల్లా ఉంటాడు. మనిషికి ఏది ముఖ్యం, ఏది కాదు అనేది బాగా తెలుసు. మనుషులతో మాటాడుతూనే కేంప్ క్లర్క్ అందించే కాగితాలమీద చకచక సంతకాలు చేసేస్తున్నాడు.

ఆయన పక్కనే వున్న యస్పీ ( యస్.పి. ) ఆయనంత తెల్లని తెలుపు కాదు. కాని ఆయనకన్నా ఆకారంలో బలంగానూ, వయస్సులో పెద్దలానూ ఉంటాడు. లేబర్ ఆఫీసర్ లావుగా, నల్లగా, బతికినంత కాలం యింకా బతుకుతానూ అన్నట్టున్నాడు.

కలెక్టరుగారి కుడిచేతిపక్క కుర్చీలో పట్టాభిరామయ్య ఎవరెస్టు శిఖరం ఠీవితో ఎత్తుగాకూర్చున్నాడు. ఆయన మొహంలో ఆతృతగాని, అనుమానాలుగాని, ఇంకే విధమయిన ఇతర ఉద్వేగాలుగాని మచ్చుకైన కనిపించవు. ఆయన కెదురుగా కుంచాలయ్యా, అతని పక్క

విశ్వనాధం ఫ్రీగా చారబడి కూర్చున్నారు.

విశ్వనాధం అక్కడ చేరిన పెద్దల్లా ఎత్తుగాగాని, స్థూలంగా గాని వుండడు. అతనిలో ప్రత్యేకతేమైనా వుంటే అతడు వేసుకున్న తెల్లటి నూలుగుడ్డలు, కళ్లల్లో తెలీని, మొహంలో ఆరోగ్యం కనిపిస్తాయి. అతనితో పోలిస్తే కుంచాలయ్య రూపు అంతకన్నా నాసిగా వుంటుంది. వడిలిన కండల్లోంచి తొలిగిన చేపను గుండెల్లో పదిలపరచు-కున్న మనిషిగా కనిపిస్తాడు.

"థేంక్స్ ! దట్సాల్ ఫర్ ది ప్రజంట్" అంటూ కాగితాలు పక్కకు తోసేసేరు రావుగారు.

"బైదిబై, మీవాళ్లు రాసిన స్లోగన్లు దారి పొడుగుతా చదువుతూ ఒచ్చేను. దే ఆర్ నాట్ బేడ్. తక్కిన రాతలతో పోలిస్తే అవి చాలా మర్యాదగానూ, హుందాగానూ వున్నాయ్" విశ్వనాధం వంక మెప్పుగా చూసేరు రావుగారు.

"మొదట్లో అలాగే వుంటాయి."

ఆమాట బయటకే అన్నాడు విశ్వనాధం. అతని మొహం మీద చిరునవ్వుంది. కళ్లలో పెంకతనం కనపడనివ్వడు.

"నా వుద్దేశం వీటిలో వ్యక్తిగత శత్రుత్వం లేదని".

రావుగారు రెండింటికీ తేడా వివరిస్తున్నారు. విశ్వనాధం ఒకవంక ఆలోచిస్తూ ఆయన చెప్పేదంతా వింటున్నాడు. ఏ కారణమైనా కావచ్చు. ఈ తగాదా శాంతియుతంగా పరిష్కరించడం రావుగారికి అత్యవసరమై ఉండాలి. ఆ అవసరమేఁవిటో తెలియదు. ఉనికి మాత్రం కనపడుతోంది. దాన్ని గురించే ఆలోచిస్తున్నాడు విశ్వనాధం.

చెడ్డరాత లెలా వుంటాయో - అందుగురించి చెప్పదలచుకున్న దంతా చెప్పి చివరకు "వాడ్డూయు సే?" అన్నారు రావుగారు.

"చెప్పడానికేఁవుంది? సమస్యకు అసలు కారణాలు గుర్తించడం యిష్టం లేప్పోతే అందుకు సంబంధించిన వ్యక్తులు మధ్యకొస్తారు. ఓ పక్షాన వ్యక్తిగత ద్వేషం పుట్టగానే,

రెండోవంకా అది పుట్టకమానదు. తేడా అల్లా - ఒకళ్ల శత్రుత్వం క్రియల్లో బయట పడుతుంది. రెండోవాళ్లది రాతల్లోనూ, అరుపుల్లోనూ పోలిస్తే రెండోవాళ్లది

నిరపాయం కదా?" అన్నాడు విశ్వనాథం.

ఒక్క యస్పీ తప్ప తక్కిన వాళ్లందరూ విశ్వనాథాన్ని పూర్వం ఎరుగుదురు. ఆయనైనా ఈ మధ్యనే ఇక్కడకు బదిలీ అయ్యేడు. ఆయన ప్రసిద్ధి విని పట్టాభిగారే ఆయన్ని రప్పించేరని ఓ వదంతి వుంది. ఈ డిస్ప్యూట్ నలుగులాటలో పడి ఏడాదీ ఏణ్ణార్థం పైనవుతుంది. ఎప్పుడు విరిగి పడుతుందో తెలీదు. ఎప్పుడో గందరగోళం, గగ్గోలూ, మంటలూ తప్పవు. ఆ సంగతి యిరుపక్షాలకూ బాగా తెలుసు.

యస్పీగారు ఆ ముందురోజునే విశ్వనాథానికి సంబంధించిన పర్సనల్ ఫైలంతా తిరగేసేరు. విన్నదానికన్న కన్నదీ, కన్నదానికన్న ఎతురుగా ఉన్నదీ తీవ్రంగా కనిపిస్తున్నాయి – ఆయన కంటికి.

"నేను స్పష్టం చేయబోయేది అదే" అన్నారు కలెక్టరుగారు. "పర్సనల్ లైక్స్ అండ్ డిస్‌లైక్స్‌కు చోటివ్వకపోతే పరిష్కారం తప్పకుండా కుదుర్తుంది."

ఆయన తాత్పర్యమేమిటో కుంచాలయ్యక్కూడా అర్థమవుతోంది.

కలెక్టరుగారి కోరికపై లేబర్ ఆఫీసర్స్ విషయాన్నంతా క్లుప్తంగా చెప్పేరు.

ద ఆర్ అండ్ ఆర్ స్టీల్ మిల్స్ 1952లో మొట్టమొదటగా పుట్టింది. ఆరంభ దశలో ఫలానా ఇంతమంది పనివాళ్లు అందులో వుండేవారు. రెండు దశల్లో అది ఫలానా ఫలానా విధంగా అభివృద్ధి చెందింది. తెలుగుదేశంలో అంత పెద్ద స్టీల్ ఫ్యాక్టరీ ఇంకోటి లేదు. ఇన్ని వందల కుటుంబాల్లో ఇన్ని వేల ఇన్ని వందల మందికి అది ఆధరువు చూపిస్తోంది. ఆశించిన విధంగా ప్రభుత్వ సహాయం అంది, తలపెట్టిన విధంగా దాన్ని వృద్ధిలోకి తెచ్చే అవకాశం లభిస్తే, ఇంకా ఫలానా యిన్ని వేలమంది పనివారికి అది ఉద్యోగాలు చూపగలదు.

పనివాళ్లకి వైద్య సదుపాయం మొదలైన ఫలానా ఫలానా ఫలానా సదుపాయాలు చాలాకాలం కిందటే చేసేరు. రవాణా వంటి మరికొన్ని సదుపాయాలు ఏర్పాటై నిండా అయిదేళ్లయినా కాలేదు. ఇప్పుడు జీతాన్ని పెంచడం, కరువు భత్యాన్ని జీవనసూచితో ముడిపెట్టడం వంటి ఆరు ముఖ్యమైన అంశాలపై ఆరాత్రి పన్నెండు గంటల నుండి సమ్మె చేయడానికి పనివాళ్లు నిశ్చయించేరు.

ఇందులో ఈ సదుపాయాలకు మేనేజ్‌మెంట్ సంత్సరం క్రితమే అంగీకరించేరు.

యూనియన్ అన్నీ ఒక్కసారే కావాలని పట్టుబట్టడంతో పనివారికి సదరు సదుపాయాలు కలిగించే భాగ్యం కంపెనీ వారికి లేకపోయింది.

ఫలానా ఫలానా సదుపాయాలు, సాటి కంపెనీలో యింకెవ్వరికీ లేనివి వీరు పొందు తున్నారు. కరువు భత్యం విషయంలో ప్రభుత్వాలే వీరు పెట్టే షరతులను తట్టు-కోలేమంటున్నాయి. అయినా దాని గురించి కూడా ఆలోచించడానికి మేనేజిమెంటు సుముఖంగా వుంది. వెంటనే జరగాలి అంటే వున్న పరిస్థితుల్లో అది తూగలేదు.

" అయితే "

"దయచేసి ఆగండి" అన్నారు కలెక్టరు గారు.

"ఇంతవరకూ మనం విన్నదానిమీద మీరు చెప్పేదేవిఁటి?" అన్నారు విశ్వనాథంతో.

"అంటే?"

"ఇంతవరకూ చెప్పిన సంగతులన్నీ నిజాలే కదా?"

"ఆహా, ఒక్కటి తప్ప".

ఏఁవిటన్నట్టు చూసేరందరూ – పట్టాభిరామయ్యక్కూడా అలా చూడాలనే వుంది. అయినా ఆయన తల తిప్పలేదు.

"కంపెనీ పుట్టుపూర్వోత్తరాల గురించీ, దాని ఘనత గురింతే చెప్పిందంతా అక్షరాలా నిజం. పనివారికి ఫలానా ఫలానావి చేసేరనడం అబద్ధం".

పట్టాభిరామయ్య కన్న ఎక్కువ ఆశ్చర్యపోయింది అక్కడి లేబర్ ఆఫీసర్.

విశ్వనాథం చెప్పుకుపోతున్నాడు.

"ఈ కంపెనీ పుట్టిన దగ్గర్నుంచి నేనిందులో పని చేస్తున్నాను. ఇందులో ఒక్కటీ మేనేజిమెంటువారు కావాలనుకొని గాని, లేబర్ కష్టం తెలిసిగాని, చేసిన సదుపాయం లేదు. టూత్ అండ్ నెయిల్ పోరాడితే తప్ప ఏ ఒక్కటీ ఊడిపడలేదు. కొన్నిటి కోసం వాళ్లు పస్తులుండి కేకలేసేరు. మరి కొన్నిటి కోసం వాళ్లు పోలేసుల్చేత లాటీ దెబ్బలిం-

టేనూ, వాళ్ల తుపాకీ గుళ్లకు పిట్టల్లా రాలిపోతేనూ, జనం ఒత్తిడి తట్టుకోలేక – అప్పుడూ వాటికి అంగీకరించేరు. మీకు తెలుసో లేదో ఆ రోజుల్లోనే మేనేజిమెంటు వారు పెట్టించిన కేసుల్లో యిరుక్కొని యిప్పటికీ పదిహేనుమంది జైళ్లల్లో మగ్గుతున్నారు. లేబరు ఆఫీసరుగారు యింతవరకూ నిష్పక్షపాతంగా యిచ్చిన రిపోర్టు మేనేజిమెంటు వారి వార్షిక నివేదిక (యాన్యువల్ రిపోర్టు) ను వడపోత పోసి తేల్చిన సారాంశం. మా మాటల్లోనే చెప్పాలంటే యిదంతా మావాళ్లు రక్తం చిందించి ప్రాణాలకు తెగించి తెచ్చుకున్న సంపాదన".

వండర్ లాండ్‌లో అడుగుపెడుతూనే అంటరాని స్విచ్చేదో అంటుకున్న అమాయకుడిలా గాభరాపడ్డారు రావుగారు. దేన్నీ తేలిగ్గా పోనిచ్చేటట్టు లేడు విశ్వనాథం. మనిషి నవ్వుతూ నే మాట్లాడుతాడు గాని ఈ మనిషికి మొహమాటాల్లేవు.

అయితే అతని రిపోర్టులోనూ కొంత తభావతుండాలి. దాన్ని వెలికి లాగాలి. పట్టాభిగారి వంక చూడగా ఆయన రావుగార్నే ప్రశ్నిస్తున్నట్టడిగేడు.

"అయితే యిదంతా జరిగిందెప్పుడు?"

"ఎప్పుడంటే, జరిగి ఏడెనిమిదేళ్లవుతుంది" అని "ఓ అదా, అదంతా వారు రాకముందే" విశ్వనాథం కూడా రావుగారితో చెప్పినట్టే చెప్పేడు.

" .. వీరి రాకకూ పూర్వానికీ, ఆ తరువాతకూ ఓ తేడా వుంది. అంతకు ముందుండే యాజమాన్యం వెనకా ముందూ ఆలోచించకుండా పనివాళ్లను అణచడానికే ప్రయ–త్నించింది. లొంగితే సరేసరి. లొంగపోతే, తిట్టుకునో తిమ్ముకునో నలుగుర్ని కొట్టించిందానికీ, పదిమందిని జైల్లో పెట్టించిందానికీ పరిహారంగానో కొన్ని సదుపాయాలు కొత్తగా చేసేవారు.

వీరి హయాం వచ్చాక జరిగిందేవిటీ అంటే – వీరు వస్తూనే ఓ పాలసీ స్టేట్‌మెం–టిచ్చారు – ఇహముందు పనివాళ్లు సమ్మెలూ గిమ్మెలూ చెయ్యక్కర్లేదు. పోలీసులు రావడం, అధికార్ల చుట్టూ తిరగడం అనవసరం. అంతా శాంతియుత సంప్రదింపులద్వా రానే పరిష్కరించవచ్చు అలా ఆ స్టేట్‌మెంటులో యింకా చాలా విషయాలున్నాయి.

పనివాళ్లు ఆ స్టేట్‌మెంట్‌ను నమ్మి వ్యవహరించటం వల్ల వచ్చిన ఫలితమేమిటీ అంటే చివరికి మీ చుట్టూ మీ చుట్టూ తిరగటం ఎలానూ తప్పలేదు. ఈ నాలుగైదేళ్లలోనూ పనివాళ్లకు జరగవలసే సదుపాయం ఒక్కటీ జరగలేదు: అందుకు సంబంధించిన ప్రతిపాదనలూ, ఎస్టిమేట్లూ అన్నీ పేపర్లమీదే మిగిలాయ్. అందుకోసం కేటాయించిన డబ్బు భద్రంగా యజమాన్ల బ్యాంకుల్లో వుందిట. ఏమేనా అంటే పరిష్కారానికి పని వాళ్లే వాయిదా లేస్తున్నారంటారు – డబ్బూ, సదుపాయాలు వాళ్లకు చేదైనట్టు !" అంటూ విశ్వనాథం ఆగిపోయాడు.

కార్మిక వివాదాలన్నవి కలెక్టర్లకు కొత్తకాదు. రావుగారికుండే తక్కువ వయసులోనే ఇలాంటివి ఆయన చాలా చూసేడు.

పనివాళ్ల కోరికలు తీర్చడానికి యజమానులనేవాళ్లకు ఎప్పుడూ డబ్బుండదు. నిష్పక్షపాతంగా చూడగలగితే వాళ్లకు దేనికీ డబ్బుంటుందో, అది ఏయే విధాల ఖర్చవుతుందో, సామాన్యులకు తెలియకపోవచ్చు కాని, పెద్దవాళ్లకు తెలీకపోదు. పైగా వివాదానికి ముందు లేని డబ్బు వివాదం తర్వాత ఎక్కణ్ణుంచి పుట్టుకొస్తుందో, ఎప్పుడూ పుట్టుకొస్తుంది.

అలాగే పనివాళ్ల కోరికలకూ అంతుండవు. ఎన్నిసార్లట జీతాలు పెంచండి. ఎన్ని కరువు భత్యాలట యివ్వండి. కొత్త కొత్త సదుపాయాలు మీ రెన్ని చేయండి. వాళ్లిం కా యింకా కావాలనే అంటారు.

.. దేనికో వున్న డబ్బు పనివాళ్ల కివ్వడానికి ఏల వుండదు? ఎంత చేసినా పనివాళ్లకు తృప్తెందుకుండదు? జవాబు వాద ప్రతివాదాల్లో వెదుకుదామంటే, ఎంత వెదికినా, ఎన్నాళ్లు వెదికినా దొరకదు. వాటి వెనక మనస్తత్వాల్లో చూడాలి.

.. యజమానులనబడేవాళ్లు ఎలా ఆలోచిస్తారంటే నడిచే ఇండస్ట్రీ అంతా తామే నడిపిస్తున్నారు. పెట్టుబడి సమస్తం పెట్టేది యజమానులు. అది నిర్వివాదాంశం – తాము పని చేయిస్తేనే పనివాళ్లు ఒళ్లొంచి పనిచేస్తారు. అంచేత పరిశ్రమా, దాని మీదొచ్చే లాభాలూ అన్నీ తమకే చెందుతాయి.

యజమాని దృష్టిలో పనివాడంటే ఆపూట గడవక పొట్టకోసం వచ్చిన కూలివాడు. అతని నేర్పెంతైనా, దాని విలువెంతైనా దాన్ని చవగ్గా అమ్మడానికి కారణాలు ఏమైనా,

అమ్ముకున్నవాడు కాబట్టి దాని ఫలితంపై హక్కు లేనివాడు. ఓ కూలీని తనకిష్టమొచ్చినంత కాలం వుంచుకొని యిష్టం లేనప్పుడు పొమ్మనే అధికారం తనకుండాలి.ఆయన ఇచ్చే దానికన్నా ఎక్కు విమ్మనడం, చచ్చిందాకా కూలీలందర్నీ పోషించమన-దం-ఎవరు ఏ కారణాలచేతట చెప్పండి. ఆయన కంటికి అన్యాయంగా కనిపిస్తుంది.

ఇహ పనివాళ్లేమంటారంటే ఇండస్ట్రీలో మేజరు పార్టు తమదేనంటారు. డబ్బు వస్తువులను పుట్టించదు కదా! గనిలో అయినా, కార్ఖానాలో అయినా వస్తూత్పత్తికి పనివాళ్లే కారకులు. వస్తువు తెచ్చిన డబ్బులో 'కూలి' అని కొంత పుచ్చుకొని, 'లాభం' అని కొంత పోగొట్టుకుంటున్నారు. అలా పోగొట్టుకున్న లాభాలే పోగుపడి యీనాడు పెట్టుబళ్లయినాయి.తమ పేర్న నమోదు కాకున్నా నిజానికి ఆ ఆస్తి తమదే అంటారు.

.. వాళ్ల దృష్టిలో పెట్టుబడిదారు పట్టపగలు గుట్టుచప్పుడు కాకుండా దోచే దోపిడీ దొంగ; జనం తాలూకూ అజ్ఞానంమీదా, ఆకలిమీదా ఆ రెంటి బాధా లేనివాళ్లలో - తన ప్రభావం ద్వారా నాటిన దురాశమీదా, బతికే రాక్షస జంతువు. దాని అంట్ల గిన్నెల కోసం కక్కుర్తి పడే మధ్య తరగతి పండే మనిషినీ, పెట్టే చేతినీ గుర్తించదు.

ఎవరి వాదం సత్యమనేది తేల్చుకోవలసేతీ వేరే మనుష్యులు. పార్టీల మనస్తత్వం యిలా వుండేటప్పుడు మధ్యవర్తిత్వం ఎలా అనేది కలెక్టరు గారి సమస్య.

"వెల్ మిస్టర్ విశ్వనాథం. జరిగిందేదో జరిగిపోయింది. దాన్నంతా తిరగదోడకండి. స్నేహ వాతావరణంలోనే సంభాషణలు సాగనీయండి. ప్రస్తుతం ఏం చేద్దాం? - ఆ సంగతి చెప్పండి".

కలెక్టరుగారి గొంతులో ఓ బెదిరింపు - ఓ లాలన వుంది. ఆ లాలన దేనికో విశ్వనాథం ఎరుగును. అంచేతనే నవ్వుతూ జవాబిచ్చేడు.
"మేం చెప్పవలసేది ముందే చెప్పేం. ఇప్పుడే చెప్పినా మీరే చెప్పాలి".

ఆ తరువాత కొంతసేపు ఎవ్వరూ మాట్లాడలేదు. రావుగారే ఓ నిర్ణయానికి వచ్చినట్టు అడిగేరు.

"కన్సీలియేషన్ టాక్స్‌లో అంగీకారం కుదరని అంశాలేవంటారు?"

ప్రశ్న తననే వుద్దేశించటం వల్ల విశ్వనాథానికి రావాగారి లైన్  ఆఫ్ ఏక్షన్ అర్థమయింది. వద్దనుకున్నా అతని మొహం కొంచెం ఎర్రబడింది.

“మీబోటి వాళ్లు ట్రేడ్ యూనియన్ వ్యవహారాలంటే బేరసారాలనే సదవగాహన కొచ్చి చాలాకాలమై పోయింది. దానికి మా బాధ్యత లేకపోయినా జవాబుదారీ మామీదే పడుతుంది – దాన్ని అంగీకరిస్తాను”.

“అయితే” – విశ్వనాధం ఆవేశాన్ని అదుపులో పెట్టుకుంటూ అన్నాడు – “మేనేజిమెంటువారు ముందుగా తమ పాలసీని వెల్లడిచినట్టే మేఁవూ మా పద్ధతి చాలాకాలం కిందటే మనవి చేసేఁవు. అందులో – వెనుకటి రోజుల్లో జరిగినట్టు యిహముందు బేరాల కోసం డిమాండ్ల సంఖ్య పెంచబోము. అవసరాల తొందరా, మేనేజిమెంటు వారి సాధక బాధకాలూ అన్నీ ఆలోచించే కోరికలు ప్రకటిస్తాం. ఒకసారి అడిగిన వాటిని ఏ పరిస్తితుల్లోనూ ఒదులుకోబోము అని స్పష్టం చేసేం. ఇంతవరకూ మేఁవీ పాలసీ తూచా తప్పలేదు. ఇహముందు కూడా తప్పే అవకాశం లేదు”.

.. యూనియన్ ఈ రకం పాలసీని చేపట్టబట్టే పట్టాభిరామయ్య గారి కది గొంతులో పుండులా తయారయి వుండాలి.

.. ఈ రకం పాలసీతో వచ్చే చిక్కు.

.. కోర్కెలు తీర్చగలమా, తీర్చలేమా అన్నదే కాదు ప్రశ్న. తీర్చడఁవా మానడఁవా అన్నది కూడా తేల్చుకోవాలి యజమాని.

.. తీరిస్తే యూనియన్ బలం పెరిగిపోతుంది. తీర్చప్పోతే యూనియన్ పట్టుదల పెరుగుతుంది.

.. శాంతి కోసం శత్రువుని పెంచడమా – జయాపజయాలు దైవాధీనమన్నారు – మొరాయించి నిలబడ్డమా – నిజంగా సమస్యే యజమానులకు.

పట్టాభిరామయ్య ఎలాంటి ఇరుకున ఉన్నాడో గ్రహించగానే కలెక్టరుకు ఓవంక జాలీ రెండో పక్క సంతోషఁవూ కలిగేయి. అయితే అది మొహంలో కనపడరాదు. రావుగారు కొంచెంసేపు ఆలోచించి అమాయకంగా అడిగినట్టు అడిగేరు.

“కానీ మిష్టర్ విశ్వనాధం! మనం అవతలివాళ్ల కష్ట నిష్టూరాలు కూడా కొంత గమనించాలి. యూనియన్‌కు మీరెలా జవాబుదారీయో మేనేజిమెంటుకు పట్టాభి

గారలాగే జవాబుదారీ. అంతేకాదు, వారి వాదనలో కూడా కొంత నిజం వుండొచ్చు.

డబ్బుతో వ్యవహారం ఎలాంటిదంటే – ఇచ్చేవాడికీ పుచ్చుకునేవాడు లోకువ అనుకుంటాం. నిజానికి ఇచ్చేవాడే పుచ్చుకునేవాడికి లోకువ. అది నా పర్సనల్ ఎక్స్పీరియన్స్ ..”

“ఒక విషయం చెప్పనా?”

“చెప్పండి”

“ప్రతి యజమానీ ఏఁవనుకుంటాడంటే – కంపెనీ డబ్బుకి సంబంధించిన వ్యవహారాలన్నీ తనకు తప్పిస్తే యింకెవ్వరికీ తెలియవనుకుంటాడు. లాభాలు గడించి పెట్టడఁవే
కాదు – వాటినన్నింటినీ జాగ్రత్తగా లెఖ్ఖలు వేసేదీ ఒక నయాపైస బీరుపోకుండా ఆయా వాటాదార్లకు పంచిపెట్టేదీ కూడా మా పనివాళ్లే. తొడుక్కునే జుబ్బాల్లో తేడా వుందే కాని లేబర్ క్లాస్కీ, మినిస్టీరియల్ స్టాఫ్కి తేడా లేదు. కనీసం మా కంపెనీలో లేదు”.

అగ్నికి ఆజ్యం తోడయిందా అన్నట్టుంది విశ్వనాథం ఆ చెప్పే తీరు.

“అంటే కంపెనీకొచ్చే లాభాల సంగతి మీకు కూడా తెలుసంటారు” రావుగారు ఏదో కుట్ర పట్టుకున్నవాడిలా మొదట విశ్వనాథం వంకా తర్వాత పట్టాభిరామయ్య వంక చూస్తూ అన్నాడు. పట్టాభిరామయ్య పట్టించుకోలేదు.

“వాళ్ల డిమాండ్సన్నీ మీటైతే అప్పుడెంత మిగుల్తుందో – అది కూడా అడగండి” అన్నాడు పట్టాభిరామయ్య – రావుగారితోనే.

“వారిక్కావాల్సినంత మిగుల్దు కాని రావలసే దానికన్న ఎక్కువగానే మిగుల్తుంది” అన్నాడు విశ్వనాథం.

“మాకు రావల్సేది ఎంతో తేల్చవలసేది ఎవ్వరు?”

“అదే తేలకుండా చిక్కుపడిపోయిన విషయం.”

విశ్వనాథం కూడా సీరియస్‌గానే జవాబిచ్చాడు.

"బలవంతుడు చెప్పడం బలహీనుడు వినడం సృష్టిలో ఆదినుండీ సాగుతూ వస్తూన్న ప్రాధమిక సూత్రం. మీకున్న బలమల్లా – మా తరుఫున మీ తరుఫున కూడా మీరే ఏర్పాటు చేసిన కొన్ని న్యాయ సూత్రాలు, ప్రాధమిక హక్కులూ – అంటే ఆ పేరుతో మీకోసం తీసుకున్న కొన్ని ప్రత్యేకమైన హక్కులు. అవేవో భగవంతుడు చేసిన శాసనాల్లాగా, జనమంతా రాసిచ్చిన దాన పట్టాల్లాగా – భ్రమపడటం, లోకాన్ని భ్రమపెట్టడం మీకు పరిపాటయ్యింది. ఇహ కుదరదు. ఆ రోజు వెళ్లిపోయింది. ఆ సంగతి గ్రహించాలి".

ఎందుక్కుదరదో, ఆరోజులెలా వెళ్లిపోయాయో అదంతా వివరిస్తున్నాడు విశ్వనాథం. రావుగారికి తెలుసు ఆ విషయాలు. అయినా చదివేడు. అంచేత వినడం లేదు.

.. నిలదీసి అడిగేశక్తి లేనంతకాలం పనివాళ్లు యజమానులిచ్చినంతే పుచ్చుకున్నారు. శక్తి పెరిగేక పెంచుకున్నంత మేరకే యజమానులు వాళ్ల జీతాలు పెంచుతూ వచ్చేరు . యజమానుల్ని బేరాలకు దించగలిగే స్థితికి వచ్చేరు.

.. ఎవరికెంత ముట్టాలనే విషయం బేరాలాడగల స్తోమతపై ఆధారపడి వుంటుందనుకోవడం ఆటవిక వాదం. పరిశ్రమలో ఎవరి పాత్ర ఎంత – దీనిని బట్టి వుంటే కొంత సబవనుకోవచ్చు.

.. పెట్టుబడిదారుదా, లేబర్‌దా – ఎవరిది పరిశ్రమలో కీలకమైన పాత్ర? తేల్చడానికి ఒక్కటే సూత్రం – అన్నాడు ఓ పెద్దమనిషి.

.. పెట్టుబడి మధ్యలో వచ్చింది. కొంతకాలం చెల్లేక అది పోక తప్పదు. అది పుట్టకముందూ అది పోయిన వెనకా ఉన్నదీ, ఉండబోయేది, ఏదో రూపంలో మనిషి చేసే పరిశ్రమ. కనీసం ఈ విషయం గుర్తించినా లేబర్ ప్రాధాన్యత అర్ధమవుతుంది. అయితే మనిషి అహంభావం చాలా బలమైనది. నిజం తెల్సుకోనీకుండా అది అడుగడుగునా అడ్డుపడుతుంది.

.. ఫలానా విషయాన్ని అంగీకరించడమా, తిరస్కరించడమా – అందులో మంచి చెడ్డలు, న్యాయాన్యాయాలూ – వీటి పరిశీలన కాదు మనచేత మాటాడించేది. అంగీకరిస్తే మనకు కలిగే ప్రమాదాలేమిటి – ఆ తరువాత చెప్పడానికి వంద వాదోపవాదాలు.

రావుగారు ఈ రహస్యం తెలిసినవారు. అంచేత ఈ వాదనల్లో నిజమెంతో అబద్ధమెంతో ఎరిగినవారు. అయితే ఆయన గవర్నమెంటు నౌకరు. పబ్లిక్ సర్వెంట్ అనేది ఆ పేరుకే అందమైన ముసుగు.

యస్పీ గారికి మాత్రం విశ్వనాథం ధోరణి, రావుగారు దాన్ని సహించే తీరూ సుతారమూ నచ్చటం లేదు. ఆయన చాలాసేపు ఓర్చి ఓర్చి చివరకు కలుగజేసు-కున్నారు.

"సరే విశ్వనాథంగారూ, ఇప్పుడు మనం సిద్ధాంత చర్చలోకి దిగి లాభం లేదు. ఇక్కడ ఈ దేశంలో నడుస్తున్నది డెమోక్రసీ. లేబర్‌కి డిమాండ్ చేసే అవకాశమే కాని డిక్టేట్ చేసే అధికారం లేదు. ఇంతవరకూ యి దేశంలో లేదు. ఆ సంగతులన్నీ నాకన్నా మీకే బాగా తెలుసు. అంచేత ఆ సంగతి అలా వుంచండి".

యస్పీ గారి ముఖం చూస్తే ఆయనగారు అంత మృదువుగా వుండగలరని కుంచాలయ్య కూడా అనుకోలేదు. తొలి విసురుకు పరిహారం చెల్లించేవాడిలా, ఆ తర్వాత అతి స్నేహంగా చెబుతున్నాడు.

"ఉన్న పరిస్థితులలో తేలవలసేది – మీరు కొంత నష్టపోవచ్చు. లేదా వారే అంతా నష్టపోవచ్చు. వివాదం అన్నాక ఎవరో కొంత పోగొట్టుకోకుండానూ, యింకెవరో కొంత త్యాగానికి సిద్ధపడకుండానూ ఎంతకాలం సాగదీసినా అది పరిష్కారం కాదు.

నా హంబుల్ రిక్వెస్టు ఏవిటంటే – నాకు మిమ్మల్నీ తెలియదు. వారినీ తెలియదు – మీకు తెలుసు, నేనీ వూరు కొత్తగా వచ్చాను, అయితే యిలాంటి సందర్భాలు నేను చాలా చూసేను – ఆరంభించే వరకే యిలాంటివి మన చేతిలో వుంటాయి – గొడవ ఆరంభమయ్యాక ఎవరి చేతిలో అది ఏ రూపం ధరిస్తుందో చెప్పలేం. అటు లేబర్ లీడర్లయినా, యిటు యజమానులైనా, ఉద్యమాలు తాము ఊహించిన విధంగానే నడుస్తాయనకోవటం శుద్ధ పొరపాటు. ఈ విషయాన్ని నా అనుభవంతో నేను నిశ్చయంగా చెప్పగలను. అంచేత నేను మరీ మరీ కోరేదేమంటే, దీని పరిష్కారం మీ చేతిలో వుండగానే ఏదో విధంగా సర్దుకొని, మీరూ మీరూ రాజీ పడటం మంచిది – చిన్న చిన్న నష్టాలు మీకే రావచ్చు, లేదా వారికి రావచ్చు. ఆ తరువాత రాగల పెద్ద నష్టాలు నివారించిన వారవుతారు".

యస్పీగారు చెప్పక చెప్పేదాంట్లో బెదిరింపే కాదు. కొంత నిజం, కొంత వేదనా

వుందనిపించింది రావుగారికి.

.. లోకంలో అందరికన్నా ఎక్కువగా శాంతి కోసం పాకులాడే దెవరంటే నిజానికి పోలీసువాళ్లు. అలా అంటే కొందరు నవ్వుతారు – (కొందరు మొహం చాటేసి నవ్వవచ్చు. అయినా నిజం నిజంవే, దానిని రావుగారు కాదనలేరు.

.. నీకు కష్టంవేంసో, కడుపుమండో, కోపంతోనో వెర్రెత్తి ప్రవర్తించడం వేరు, నీ ఆస్తి రక్షించకోవడానికి – లేదా నీకు రావలసేదాన్ని – రావలసిందని నువ్వు భావించేదాన్ని – రాబట్టుకోడానికి – లేదా రావలసేదాన్ని – రావలసిందని నువ్వు భావించేదాన్ని – రాబట్టుకోడానికి నువ్వే నీ ధన మాన నష్టాల్ని రిస్క్ చేయడం వేరు.

.. ఒత్తికొత్తినే, తనకు పట్టని ఎవరి చావు కోసమో, వందమంది శత్రుత్వాన్ని కొని తెచ్చుకొని – వాళ్లను కొట్టి తను దెబ్బలు తిని కసి పెరగ్గా, కావాలని రాక్షసత్వాన్ని కౌగలించుకోడం పోలీసు వారి దురదృష్టం. కేవలం పొట్టకూటి కోసం ఇరుపక్షాల కోపాలకూ, నిందలకూ గురి కావడం, పాలకుల దృష్టిలోనూ, పాలితుల దృష్టిలోనూ, సమంగా చులకన కావడం వాళ్ల దౌర్భాగ్యం.

.. అయితే జనంలో తెలిసినవాళ్లూ, తెలియనివాళ్లూ ఒకేవిధంగా వాళ్లని శతృవుల్లా ఎందుకు చూస్తారూ? వాళ్లకు కావలసేది నీ వుద్దేశాల మంచి చెడ్డలు కాదు – నీ పనులవల్ల వాళ్లకు జరిగే మంచి చెడ్డలు – జనానికి పట్టేవి ఎప్పుడూ ఫలితాలే. అందుకే పోలీసుల్ని శాంతి ప్రియులంటేనూ, శాంతి అందరికన్నా వాళ్లకే ఎక్కువ అవసరమంటేనూ ఎవరూ నమ్మరు, నమ్మలేరు.

యస్పీగారికి విశ్వనాథం వెంటనే జవాబివ్వక పోవడంతో రావుగారికి కొంచెం ఆశ కలిగింది. ఆయన విశ్వనాథం మొహంలోకి తదేకంగా చూస్తూ కూర్చున్నారు.

విశ్వనాథం ఏంవాలోచిస్తున్నాడో .. కొంచెంసేపు మధ్యనున్న టేబుల్ మీదికి చూస్తూ కూర్చున్నాడు. కుంచాలయ్యకు అతని ఆలోచన అనుమానం కలిగించింది. దాని గురించి అతనేదో చేద్దామనుకుంటూండగా రావుగారు మొదలెట్టేరు.

"వెల్ మిష్టర్ విశ్వనాథం, ఐ యామ్ ఆల్సో ఫర్ పీస్. ఆ మాటకొస్తే యిక్కడ అందరం శాంతిని కోరేవాళ్లమే. మీరూ, మీరూ – అటు పట్టాభిరామయ్య గారు కూడా! కాపోతే మీరు ఉద్రిక్తులై వుండడం వల్ల కొంచెం తీవ్రంగా మాటాడుతు–

న్నారు – ప్రాథమికంగా ప్రతివాళ్లూ శాంతినే కోరతారని నా విశ్వాసం. అందుచేతే మహానుభావులంతా శాంతిని గానం చేస్తారు.

దేశంలోనూ, రాష్ట్రంలోనే పరిస్థితేఁటో నే చెప్పఖ్ఖర్లేదు. నిప్పురవ్వ చిన్నదే కావచ్చు. దాని గురించి యస్పీగారు ఇప్పుడే చెప్పేరు. మళ్లా దాన్ని వివరించబోను. గొప్ప గొప్ప ఆదర్శాల కోసం మనం చిన్న చిన్న కష్టాలకు తల ఒగ్గడం ఓడిపోవడం కాబోదు.

ఇండస్ట్రియల్ స్టెబిలిటీ (పారిశ్రామిక సుస్థిరత) అవసరం ఎంతో నేను మీకు చెప్పాలా? స్టీలు ప్రాముఖ్యత గురించి కూడా మీరెరుగుదురు. మీ మీ సఖ్యత దేశానికి చాలా అవసరం.

మీ కోసం కాప్పోయినా మా కోసం, దేశం కోసం కాప్పోయినా ఓ గొప్ప ఐడియల్ కోసం మీరు కొన్ని త్యాగాలు చేయవచ్చు. మీరు ఆలోచించండి. మీరు బాగా ఆలోచించిన కొద్దీ నా మాటల్లో నిజం మీకే కనబడుతుంది".

రావుగారు ఆగిపోయేరు. సెంటిమెంట్ అంటే గౌరవం పట్టాభిరామయ్యకి ఏనాడో పోయింది. కాని ఒక్కోప్పుడు అది మంచి ఉపకరణం. దాన్నెవరూ కాదనరు. కాని ఇక్కడది పని చేస్తుందా? చేయదు. పట్టాభిరామయ్యకు తనమీద తనకే చిరాక–వుతోంది.

విశ్వనాథం చురుగ్గా ఆరంభించేడు.

"తెలుగు కవుల్లో ఒకాయన వున్నాడు. కవిత్వాన్ని ఆస్వాదించడమే కాని, కవులను గుర్తు పెట్టుకునే గుణం లేదు నాకు. ఆయన ఓ గేయంలో చెప్పిందాని సారాంశం ఏఁవంటే –

"శాంతి! శాంతి!! శాంతి!!! శాంతంటావు! ఎవరికి నీ శాంతి! దేనికి నీ గగ్గోలు? అంటూ ఆయన కొన్ని చిత్రమైన విషయాలు చెప్పేడు.

కొట్టే చేతిని పట్టుకోడం, తిట్టే నోటికెదురు తిరగడం కూడా శాంతికి భంగకరాలంటారు. క్రూరమృగం నిన్ను పట్టుకు తింటోంది. కదిల్తే కల్లోలం తప్పదు కదా! కదలకుండా భోంచేయనియ్. అదేనా నువ్వు కోరే శాంతి? బాకో, చాకో చూసి గూండా నిన్ను దోస్తాడు – తిరగబడితే రక్తపాతం తప్పదు. అంచేత కిక్కురుమనకు – అదేనా

నువ్ చెప్పే శాంతి వాదమంటాడు.

ఇలాంటివి ఆ కవి చాలా చెప్పేడు. ఆవేశంలో అతిగా అన్నాడు అని అనుకున్నానే కాని అందులో నిజం చాలావుంది అనిపిస్తోందిప్పుడు.

న్యాయమైన కోరికలు మేం ఒదులుకోప్పోతే శాంతికి భంగం కలుగుతుంది. తీర్చవలసే కోరికలు వారు తీర్చప్పోతే శాంతికి భంగం కాదు.

శాంతియుతమైన సంప్రదింపుల్లో యింతకాలంవూ వారు మొరాయించింది అశాంతికి దారి తీసేది కాదు. చట్ట సమ్మతంగా మేం రేపు సమ్మె చేయబోతే అది అశాంతికి దారి తీస్తుంది. ఆ నిప్పురవ్వతో దేశమంతా మండిపోతుంది.

ఘర్షణకి బాధ్యత ఎప్పుడూ ఒక పక్షానిదే. దేవుడి కోసం, దేశం కోసం, మనిషి కోసం, లేనివాడు ఎప్పుడూ త్యాగం చేయాలి. రెండోవాడిపై ఎవడు, ఏమాత్రం ఒత్తిడి తెచ్చినా అది వాడి హక్కులమీదా, వ్యక్తిమీదా ఘోరంగా చేస్తున్న దాడిలా అనిపిస్తుంది. సమతా ధర్మం అన్నది చదువుకున్న పెద్దలందరికీ ఒక్కలాగే అర్థమౌతుంది. నిజంగా చిత్రమైన సంగతి". ఇలా అంటూ ఆగిపోయేడు విశ్వనాథం.

అప్పటికిగాని – ఉద్దేశపూర్వకంగానో, నిరుద్దేశ్యంగానో – తాము ఏకపక్షంగా మాట్లాడుతున్నామనే సంగతి రావుగారికి తట్టలేదు. అయితే విశ్వనాథం దాన్నంత వ్యంగ్యంతా ఎత్తిచూపడం మొరటుగా కనిపించింది.

కొన్ని ఘటాలకు ఎన్ని పుటాలు పెట్టినా మారవంటారు. విశ్వనాథం ఆ జాతివాడని తేలిపోయిందనుకున్నాడు పట్టాభిరామయ్య.

"సరే పట్టాభిగారూ మీరేవంటారు? అన్నారు రావుగారు. ఆయన అప్పుడా ప్రశ్న వేస్తారని పట్టాభి ఎరుగరు. అతని జవాబు కూడా సిద్ధమౌతూనే వుంది.

.. కత్తిమీద సాములా, ఎత్తుమీద ఎత్తుగా, అనుసరిస్తూ వచ్చిన విధానం విడిచి పెట్టక తప్పేటట్టు లేదు.
.. ఒకవంక ఓటమి, ఘోరమైన ఓటమి, శాంతికోసం లొంగమంటే ఎవరో వెర్రి–వాళ్లు నమ్మాలి. ఎదుటవున్నది వెర్రివాళ్లు కారు. ఎవరు అయినా, కాకపోయినా విశ్వనాథం కాదు.

.. రెండోవంక యింతకాలమై తాను కలలుకంటూ వచ్చిన శాంతి, ఈ పాము పక్కలో వుండగా తనకు దక్కేది, ఎలానూ శాంతి కాదు. పేరుకైన శాంతి. కంటికనిపించే శాంతి – దాన్నైనా ఈ మనిషి దక్కనివ్వడు.

.. చివరి కార్డు కూడా చూసేక టేబుల్ తిరగేయవచ్చు. మించిపోయింది లేదు. ఎదురుచూస్తున్నాడు పట్టాభి.

ఈలోగా రావుగారు చెప్పుకుపోతున్నారు.

"విశ్వనాధం గారు ఆవేశంగా మాటాడవచ్చు. లేదా మీ పనివాళ్లు వాదనను ఆయన సమర్ధంగా రిప్రెజెంట్ చేయలేకపోవచ్చు. అంతమాత్రాన పనివాళ్లు మీ పనివాళ్లు కాకపోరు. వాళ్ల కోర్కెల్లో అంతర్గతంగా వుండే న్యాయం తగ్గిపోదు. అందుచేత దూరంగా ఆలోచించి చెప్పండి.
మీ విజ్ఞత మీద నమ్మకంతోనే మిమ్మల్ని చివరి వరకూ కదపలేదు."

"నేనొక్క మాట అడుగుతాను." చెప్పండి అన్నట్టు రావుగారు పట్టాభిరామయ్య వంక చూసేరు.

"ఇప్పుడు పనివాళ్లు కొన్ని కోరికలు కోరేరు. అవకాశం వుంటే తప్పకుండా తీర్చ–వలసినవే. కాని, యిందులో ఏ ఒక్కటి లోపించినా మర్నాడే జనం చచ్చిపోతారంటారా?'

"లేదు. యివాళ మీకూ నాకూ వుండే కార్లూ, మేడలూ, ముప్పూటలా మూడు విందు భోజనాలూ, ఇంటినిండా ఖరీదైన ఈ దుస్తులూ, రిక్రియేషన్ పేరిట క్లబ్బుల్లో అంతులేని భోగాలూ, సినిమాలూ, రేడియోలూ, ఎన్ని తరాలు తిన్నా తరగని బ్యాంక్ బ్యాలన్స్‌లూ – ఇందులో ఏ ఒక్కటో కాదు, అన్నీ లోపించినా బతకవచ్చని చెప్పడా–నికి భారతదేశంలో నలభై తొమ్మిది కోట్ల తొంభై తొమ్మిది కోట్ల తొంభై నాలుగు లక్షల నిదర్శనాలున్నాయి. అయినా మన సొంతానికొచ్చేసరికి మీరు నమ్మలేరు. మేఁవూ నమ్మలేఁవు".

కలెక్టరు గారు "ప్లీజ్, ప్లీజ్" అంటూ మరీ మరీ మందలించడంతో విశ్వనాధం క్లుప్తీకరించుకోక తప్పింది కాదు.

పట్టాభిరామయ్య మొహం క్షణకాలం భగ భగ మండిపోయింది. బట్ హి విల్ నాట్ బి డిస్టర్బ్‌డ్. అంచేత శాంతంగానే చెప్పుకుపోయారు.

".. అయినా మీరనే శాంతి కోసం నేనో నిర్ణయానికి వచ్చాను. వాళ్లు కోరే సదు–పాయా లన్నిటికీ మేవంగీకరిస్తాం. ఉభయులకూ అంగీకారమయ్యే – పెద్దలు నిర్ణయించిన – కాలపరిమితి లోగా మళ్లా ఎట్టి ఆందోళనలకూ దిగబోమని వాళ్లని హామీ యిమ్మనండి. "

అంత హుందాగా, వుదారంగా వ్యవహరింపగల మనిషి లేడనిపించేడు పట్టాభి రామయ్య.

న్యాయమే కదా! అన్నట్టు చూసేరు తక్కిన యిద్దరు ఆఫీసర్లూ. కలెక్టర్ రావ్ విశ్వనాథం కేసి తిరక్కముందే అతను జవాబిచ్చాడు.

"పట్టాభిరామయ్య గారు జరగని పనేదో చూసి దాన్ని షరతుగా అడిగేరు. మా యూనియన్ ఏ పరిస్థితుల్లోనూ ఇలాంటి దానికి ఒప్పుకోదని ఆయనకు బాగా తెలుసు. యజమానులకుండే అంగబలం, అర్ధబలంతో వాళ్లు కొనగల కోర్టుల్నీ, పోలీసుల్నీ, జైళ్లనూ వాళ్ల రక్షణ కిచ్చింది – ఈ దేశంలో వున్న వ్యవస్థ. ఏమీ లేని పసివాడి చేతిలో ఒకే ఒక హక్కు – సమ్మెచేసే హక్కు – మిగిల్చింది రాజ్యాంగం. ఆ సమ్మె చేసే హక్కును ఈయనగారు తాకట్టు కోరే పద్ధతి – దొంగ కావలివాణ్నీ నీ కఱ్ఱ యిచ్చేయ్, నీ తోటలో కోసుకున్న పళ్లు నీకు పెడతా ననడం. అందుకు పొర పాటునైనా బుద్ధున్న పనివాడెవ్వడూ అంగీకరించడు – కనీసం నా నాయకత్వంలో అలాటి పని ఎన్నటికీ జరగదు".

ఇంక నేనేం చెయ్యగల్ను అన్నట్టు గడ్డం కింద ఉన్న రెండు చేతుల్నీ పక్కలకు విసిరి ఎదురుగా చూసేడు పట్టాభిరామయ్య.

ఇహ లాభం లేదనుకున్నారు మధ్యవర్తులు – ఎవరికి వారే.

పట్టాభిరామయ్య పన్నుగడ వినిపించాలని విశ్వనాథం మనసు మహా పీకుతోంది. అరణ్య రోదనం. లాభం లేదని అతడి అనుభవం చెబుతోంది. కుంచాలయ్య నోట్లో ఏవేవో మాటలు పెదవులు దాటి బయటకు రాకుండా సంకుల సమరం చేస్తున్నాయి.

టంగ్ టంగ్ అంటూ ఆగకుండా పన్నెండూ కొడుతుంది – కుంచాలయ్య నెత్తిమీద వున్న గడియారం. కలెక్టరుగారు పక్కనే సిద్ధంగా నిలబడి కాంప్ క్లర్కనీ ఎదురుగా గుమ్మం దగ్గర ఫైళ్లతో నిలిచి వున్న డవాలీనీ ఒక్కసారే చూసేరు.

“సరే ఒకపని చేద్దాం” అంటూ లేచి నిల్చుని పట్టాభిరామయ్య నుండి ఆయన ప్రతి పాదనలు అర్ధరాత్రి వరకూ నిలిచేటట్టు వాగ్దానం పుచ్చుకున్నారు. విశ్వనాధం సాయంత్రం ఐదు తర్వాత ఎక్కడెక్కడ దొరుకుతాడో తెల్సుకున్నాడు.

మరో నిమిషం తర్వాత పోర్టికోలో ఒకేసారి బయలుదేరిన కార్లూ, జీపులూ వంక చూస్తూ విశ్వనాధం, కుంచాలయ్యా మేడమెట్లు దిగుతున్నారు.

ఆ సాయంత్రం కలెక్టరుగారి బంగళా నీరెండలో నిశ్శబ్దంలో అతి ప్రశాంతంగా వుంది. చుట్టూ పెద్ద పెద్ద నల్లని మఱ్రి చెట్లు, ఎఱ్ఱని పచ్చని పూలతో నిండుగా తురాయి చెట్లు, కొత్తగా వెల్లవేసిన బంగళాకి ఎడాపెడా చక్కగా విరియ పూసిన పూల మొక్కలు, బంగళా ముందు ఒత్తుగా పెరిగిన పచ్చిక తివాచీ. ఆ లాన్‌లో టీ టేబుల్ చుట్టూ కలెక్టరుగారూ, వారి సతీమణీ, విశ్వనాధం కూర్చుని టీ ముగించేరు. ఫోన్ కాల్‌తో లోపలికి వెళ్లిపోయింది మిసెస్ రావు. బట్లరు టీ సరంజామా తీసుకు పోయాక సిగరెట్ వెలిగించేరు రావుగారు.

“ఏం జరిగిందో తెలుసా – సాయంత్రం అయిదింటికి ఓ మిత్రుణ్ణి యింటికి పిలిచేను. అయిదుకు అయిదు నిముషాలముందే ఫోనొచ్చింది, ఆయన గారికి అర్జంటు పని తగిలిందట క్షమించ మన్నాడు” అన్నారు రావుగారు.
ఆయన చెప్పకపోయినా ఆ మిత్రుడెవరో విశ్వనాధం వూహించ గలిగేడు.
జిల్లా ఆఫీసర్లని ఎంత ఛండాలపు వుద్యోగాలో వివరిస్తూ సంభాషణ మొదలెట్టేరు రావుగారు.

“యు నో, నే నీ ఉద్యోగానికి రాకముందు కాలేజీ లెక్చరర్ గా వుండేవాణ్ణి. దేశం కోసం, జనం కోసం ఏదైనా చెయ్యొచ్చుననే వుద్దేశ్యంతో నే నిందులో కొచ్చేను. కాని అధికారానికీ, స్వేచ్ఛకీ ఎన్ని పరిమితులున్నాయో ఇందులో కొచ్చేక తెలిసింది ”.
అంటూ ఆయన ఈ దేశంలో రాజకీయ నాయకులుగా చలామణీ అయేవారు ఎంత అజ్ఞానులో వివమర్చి చెప్పేరు.

“కనీసం ఎకనమిక్స్, హిష్టరీ, జాగ్రఫీలలో నైనా మన రాజకీయ నాయకులకు ఓనమాలు తెలియవు. ఆ అజ్ఞానంతోనే వాళ్లు దేశానికి సంబంధించి పెద్ద పెద్ద విషయాలమీద అభిప్రాయాలు ప్రకటిస్తారు. శాసనాలు చేస్తారు. పరిపాలనా వ్యవహారాల్లో అడుగడుగునా అడ్డు తగుల్తారు.

నా మటుకు నేను ఒకప్పుడు చాలా బాధపడ్డాను. ముష్టి జీతపురాళ్ల కోసం నా ఆత్మ నమ్ముకుంటున్నాను. నిజానికి నే నీ వుద్యోగం లేకపోయినా బతగ్గలను. అయినా దీనికే అంటిపెట్టుకున్నాను. ఎందుకు? దేశానికి ఏదో ఒరగబెడదామని – నాలాగే ఎంతమంది ఆత్మవంచన చేసుకుంటున్నారో చెప్పలేను.

రాజకీయాలపట్ల ఆసక్తి వున్నవాళ్లూ, నిస్వార్ధంగా జనం కోసం పని చేయగల విద్యా వంతులూ వుద్యోగాలే చేస్తుంటారు. ఏ వుద్యోగాలకీ అర్హత లేనివాళ్లు మాత్రమే రాజకీయాల్లో చేరుతున్నారు.

ఈ దేశంలో వున్నత విద్యావంతులు చేస్తే వుద్యోగాలు. లేదా పై దేశాలకు వలస పోతారు. కీలక స్థానాల్లో వుండవలసిన సైంటిస్టు వుద్యోగాలకు కూడా మెరిట్ కాకుండా రికమెండేషన్ ప్రాతిపదిక అవుతోంది .. ”

ఈ ధోరణిలో రావుగారు చాలాసేపు మాటాడేరు.

ఆయన మాటల్ని బట్టి చూస్తే విశ్వనాధానికో విషయం బోధపడింది.

దేశంలో అన్న వస్త్రాల కరువుంది. అది ఘోరమైందే. కాని అంతకన్నా ఘోరమైంది – అటు ప్రజలగ్గాని, యిటు ప్రభుత్వానిగ్గాని శాస్త్రీయ జ్ఞానం పట్ల, విజ్ఞానం పట్ల ఆసక్తీ – గౌరవం లేకపోవడం. దీనివల్ల ఏర్పడే బ్రెయిన్ డ్రైన్, బ్రెయిన్ వేస్ట్ – ఈ రెండే దేశంలో అనర్ధాలన్నిటికీ మూలకారణాలనుకుంటారు రావుగారు.

రావుగారి పీకులాట అర్ధమయిందతనికి. కొంతసేపాగి రావుగారే అడిగారు.

“మీరు చాలా చదివారని విన్నాను. నా అభిప్రాయాలు గురించి మీరేమంటారు?” అని ఆంగ్లంలో అడిగేరు.
“నేనేమీ అనను” – విశ్వనాధం.
“మీకు ప్రజాస్వామ్య పద్ధతులు మీద అసలు నమ్మకం లేదు?”
“లేదు”
“ఎంచేతో తెలుసుకోవచ్చా?”
“తెల్సుకోవచ్చుగాని మీరు తెల్సుకోరు”.

విశ్వనాధం మొహంమీద ఎప్పటిలాగే చిరునవ్వు.
రావుగారు అఫెండ్ కాలేదు. స్పోర్టివ్‌గా ప్రారంభించేరు.

"వెల్ మిష్టర్ విశ్వనాథం. నేనేమైనా చెప్పేముందు మీకు రెండు విషయాలు చెప్పాలి. మొదటిది ఐయామ్ నాట్ స్కంక్. ఇతరుల దగ్గర్నుండి కూపీలు లాగడం నాకు పరమ అసహ్యం. రెండోది ఐ హేవ్ ఓపెన్ మైండ్. నాకే విషయమేనా చెప్పండి. చేయగలిగితే నేనూ కన్విన్స్ అవుతాను. అంటూ –

"ఉదయం మీరేదో గేయం గురించి చెప్పేరు. రాయడానికేం ఎన్నేనా రాయొచ్చు. కవిత్వానికి చాలా మహత్యం వుంది. నేను కాదనను, కానీ జీవితం వేరు కదా! మీరు కోరే సమ సమాజం శాంతియుతంగానే సాధించ వచ్చనుకోండి. మీ కభ్యంతరంవా?" అన్నారు రావుగారు.

"ఎప్పటికీ కాదు."
"అయితే ఎందుకు ప్రయత్నించరు?"
"ఇరవై యేళ్ల చరిత్ర అది నిరుపయోగమని తేల్చింది.
"అంతకు ముందు అరవై యేళ్ల చరిత్ర ఇంకోలా చెప్పలేదు".
"లేదు".

అలాంటి పొట్టి జవాబులను దెబ్బతియ్యడం కష్టం.
విశ్వనాథం కొంచెంసేపు చూసి మనసు మార్చుకున్నాడు.

"మీరెంతలా చెపుతున్న ఆ అహింసా సిద్ధాంతం మీద మీకైనా నమ్మకం వుందా? ఎందుకంటే శాంతి, అహింస అనే పదాలను మీరు గందరగోళం చేస్తున్నారు. గాంధీగారి ఉద్యమాలవల్ల కూడా దేశంలో బోలెడు అలజడి లేచింది. శాంతియుత విప్లవం పేరిట ఇందిరాగాంధీ చేయబోయే మార్పుల నెదుర్కొంటూ దేశంలో ఎంతో అలజడి వుంది. మార్పు ఎప్పుడూ శాంతి మార్గాన వచ్చే అవకాశం లేదు".

విశ్వనాథం చెప్పింది రావుగారు ఒప్పుకున్నారు.

"వాదం కోసం గాంధీగారి అహింసా పద్ధతివల్లే స్వరాజ్యవ వచ్చేసిందని ఒక్క క్షణం ఒప్పుకుందాం. అయితే నిన్న పనికొచ్చిన పద్ధతే ఇవేళా పనికొస్తుందనీ, ఒకదానికి పనికొచ్చిందే అన్నిటికీ పనికిరావాలనీ ఎక్కడా లేదుకదా! నిన్నటికీ ఇవేళ్టికీ చాలా తేడా వుంది –

అప్పుడు మనం కోరింది పరాయి పాలన నుండి విముక్తి. ఇప్పుడు జనానికి

కావలసేది దోపిడీ నుండి విముక్తి.
బయటినుండి వచ్చిన శత్రువు వాడు. ఇంట పుట్టి తాళాలు చేజిక్కించుకున్న దొంగలు వీరు. పొమ్మంటే బతకడానికి వాడికింకో చోటుంది. కడంటా పోట్లాడ్డం తప్ప గత్యంతరం లేనివాళ్లు వీరు. బలం క్షీణించిన శత్రువు వాడు. క్షణక్షణానికీ బలం పెంచుకుంటున్న శత్రువులు వీరు.
ఎప్పుడో మా తాతలు రణపాల ఆకుతో మహావ్రణాలు మాన్పేవారు. ఇప్పుడు కుళ్లిన కాలును సర్జన్లు అలాగే ఎందుకు నయం చేయరు? – అనటానికి మాట అందంగానే వుంటుంది. కాని అది అసంగతం – నిత్యం వింటున్నదే"
అని విశ్వనాథం ఆగిపోయేడు. కొంతసేపు పోయేక –

"మహాత్ముడు చూపించిన అహింసా మార్గాన్ని జనం మరిచిపోతున్నందుకు పండితులు వాపోతూ వుంటారు.

అప్పటి సంగతి వదిలేద్దాం, స్వతంత్రం వచ్చేక చిన్న చిన్న ఉద్యమాలు నడిచేయి – భాషా రాష్ట్రోద్యమాలు, విద్యార్థుల అలజళ్లు, అధికారుల దౌర్జన్యాలకు నిరసనగా – పెరిగే ధరలకు వ్యతిరేకంగా, ప్రజలూ ఉద్యోగులూ నడిపినవి. ఉక్కు ఉద్యమం, హిందీ వ్యతిరేకోద్యమం వంటివి. ఇవేవీ వ్యవస్థలు మార్చటానికి కాదు. ప్రభుత్వాలను కూలతోయటానికీ కాదు – ఎంతకూ ప్రజల గోడు వినిపించుకోని నాయకుల ఉదాసీనతకు అలిగి, నిరసనగా నడిచినవి.

అలాంటి వాటిని సహితం మాటిమాటికీ అహింస మంత్రాన్ని ఆశ్రయించే నాయకులు, శాంతి సమరాల్లో కాకలు తీరిన రాజకీయ యోధులు ఏ పద్ధతిలో ఎదుర్కొన్నారు.

కడుపులో చల్ల కదలని మేధావుల దృష్టిలో అహింస ఎంత గొప్పదైనా కావచ్చు.

ప్రత్యక్షంగా – మానవులకూ ప్రదర్శనలకూ మౌనం, ఘెరావోలకు లాఠీ ఛార్జీలు, రాళ్లకు బుల్లెట్లూ జవాబులు పొందే జన సామాన్యానికి దానిమీద విశ్వాసం మిగల్దు. నమ్మినంత కాలం గొడ్డు గొడారిని నమ్మినట్టు జనం శాంతియుత అహింసా వాదాన్ని ముక్తి తారక మంత్రం కన్నా ఎక్కువ భక్తి విశ్వాసాలతో కొలిచేరు. దాని నిజస్వరూ–పం తెలియగానే ఆ భక్తి విశ్వాసాలు పేక మేడలకన్నా కనాకష్టంగా దడదడ కూలి–పోతున్నాయ్." అంటూ విశ్వనాథం ఆగేడు.

పొద్దెప్పుడు పోయిందో లాన్‌లో డోమ్‌లైట్ ఎప్పుడు వెలిగిందో విశ్వనాథంగాని, రావు గారు గాని గుర్తించలేదు. కొంతసేపు యిద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నాక జేబులో సిగరెట్ పేకెట్ వెదుకుతూ విశ్వనాథం ఆరంభించేడు.

“ఈనాడు శాంతి శాంతంటూ శాంతి కోసం కలవరించే వారెవరో ఒక్క క్షణం ఆలోచించండి. జనానికి శాంతిపన్నాల మీద విశ్వాసం ఎందుకు సడలిపోతోందో తె లుస్తుంది. స్వేచ్ఛగా మసలడానికో యిల్లూ, కడుపునిండా తినేందుకు తిండీ, కట్టేందుకు ఖరీదైన గుడ్డా అందిన వాళ్లందరికీ శాంతి కావాలి.

ఇవన్నీ అంవరకపోయినా వాటిని ఆర్జించుకునే అవకాశం దొరికిన వాళ్లకి – దాన్ను పయోగించుకొని పెరగడానికి శాంతి చాలా అవసరం. ఈ తక్కువ కాలంలో నే అంది పుచ్చుకున్న అవకాశాల్తో అవలీలగా ఆస్తులు సంపాదించిన పెద్దలకు, తామేకాక తమ తరువాత తరాలు కూడా నిష్పూచీగా నిరాటంకంగా అనుభ– వించేందుకు, సుస్థిరమైన శాంతి తప్పకుండా కావాలి.

దురదృష్టంవేవిటంటే ఈ దేశంలో అలాంటివాళ్లు చాలా తక్కువమంది ఉన్నారు. తరతరాలుగా అష్టకష్టాలు పడుతున్నా, యీనాటికీ తిండికీ గుడ్డకూ నోచని వారి సంఖ్య కోట్లమీద వుంది. వాళ్లందరూ యి వ్యవస్థను శాంతంగా యిలాగే సాగనిస్తే వాళ్లకే కాక, వాళ్ల తర్వాత తరాలక్కూడా బ్రతుకల్లా తీరని హింసా, అశాంతీ తప్పవు.

లోకంలో నిత్యం జరుగుతున్న యీ హింస తలచుకుంటే నిస్వార్థపరుల కెవరికైనా, మేధావులు ఘనంగా కీర్తించే శాంతి అంత ముఖ్యం కాదనిపిస్తుంది.”

అని కొంతసేపాగి –

“నాదేం వుంది? నేనూ మీలాగే ఉద్యోగిని. నాకూ నా తోటివారికీ కడుపు నిండడానికి కొంత కూడూ, కట్టుకుందికి ఏదో ఓ రకం గుడ్డా దొరుకుతున్నాయి. అందుకే మేం ‘శాంతియుత సహజీవనం’ వరవడిలో సమ్మె చేస్తున్నాం. సమ్మె చేస్తామన్నామే కాని యజమాని తలకొట్టి మిల్లు గుమ్మానికి వేలకడతా మనలేదు. అయినా మేం అంతమాట అనేసినట్టు గొడవ జరుగుతోంది”. అని విశ్వనాథం ఆగి పోయేడు.

చివర చివర చెప్పింది రావుగారు పట్టించుకోలేదు. శాంతి కావాలనేవాళ్లలో తాను ఏ తరగతికి చెందుతానా అని ఆలోచిస్తున్నారు.

ఆయన మొహంమీద కనిపించే దీర్ఘాలోచనను విశ్వనాథం యింకోలా అర్థం చేసుకున్నాడు.

"శాంతి విధ్వంసకులు ఎప్పుడూ సమ్మెలు చేసేవాళ్లే అని లోకంలో ఓ నమ్మిక వుంది. పేపర్లు చదివి ఫేక్ట్సు తెలుసుకునేపెద్దలకు అలాంటిది ఏర్పడడం సహజం. మీక్కూడా అదే భావం ఉంటుందని నే ననుకోను. అయినా మీకీ విషయం చెప్పాలి.

ఈ సమ్మెను మేం శాంతియుతంగా సాగిద్దామనుకుంటున్నాం. సాగడం సాగకపో-వడం మా చేతుల్లో లేదు. అది ఏ పద్ధతిలో సాగవచ్చో మీకు ముందే చెప్పగలను.

మీరు రాత్రికి ఊరు వెళుతున్నారట కదా?"

నీకెలా తెలిసిందన్నట్టు తలెత్తి చూసేరు రావుగారు. అది గమనించనట్టు చెప్పుకు పోయేడు విశ్వనాథం.

"తిరిగి వచ్చేసరికి నాలుగైదు రోజులు కాకపోదు.
ఈ రాత్రి పన్నెండు గంటలకు సమ్మె ఆరంభం అవుతుంది. శతవిధాల పట్టాభి-రామయ్య గారు లకౌట్ అంటారు. అంతకు కొన్ని గంటల ముందరో ఆ తరువాత కొన్ని గంటలు గడిచేకో శాంతి భద్రతల పేరుతో పోలీసువారు నాయకత్వాన్ని మూసేస్తారు.
లాకౌట్‌కే మండిపడుతున్న వర్కర్స్, నాయకత్వం జైళ్లపాలు కాగానే మతి పోగొట్టు-కుంటారు. ఎదురుగా యజమానుల ఆస్తిపాస్తులకు అంగరక్షకులైన మీ పోలీసులు తుపాకులతో సిద్ధంగా నిలబడతారు.
నిస్సహాయుల్లా నిర్వీర్యుల్లా పడి వుండడానికి మా వాళ్లను శౌర్యం, మానాభిమానాలు బతకనివ్వవ్. చెయ్యో, కాలో, చివరకు గొంతు కదిలినా శాంతికి భంగం అవుతుంది. లాఠీ ఛార్జ్, టీర్ గాస్, తుపాకీగుళ్లు – వీటితో శాంతి నెలకొంటుంది.
తరువాత – యేళ్ల తరబడి కోర్టులూ, సాక్ష్యాలూ, జైళ్లూ, ఉద్యోగాల్లోంచి మనుష్యుల ఏరివేత. ఇవన్నీ మాకు తెలుసు. అయినా దేన్నీ మేము ఆపలేము – ఎందుచేత?"

ప్రశ్నవేసి ఆగిపోయాడు విశ్వనాథం. రావుగారు ఏం జవాబిస్తాడు?
కొంతసేపు మౌనంగా కూర్చుని, అకస్మాత్తుగా అన్నారు రావుగారు.

"వెల్ మిస్టర్ విశ్వనాథం, మీరు చెప్పే విషయం అర్థమయ్యింది. నేను కూడా

ఒక్క విషయం చెప్పాలి. నేనీ జిల్లాకు బదిలీ అయి దాదాపు మూడేళ్లవుతుంది. చెప్పుకోదగ్గ అలజడి లేకుండా యింతవరకూ తోసుకురాగలిగేను.

నేను మిమ్మల్ని వాగ్దానా లడగను. సాధ్యమైనంతవరకూ మీ పక్షాన తప్పులేకుండా చూడండి. ఎటుపోయి యెటు వచ్చినా పట్టాభిరామయ్య గారి సిగపువ్వు వాడదు. ఏ అఘాయిత్యం జరిగినా, ఏడ్చేవి కొన్ని పేద కుటుంబాలు. అది తలచుకుంటే – అర్థం లేని కోరికని తెలిసినా – అడగక తప్పలేదు".

రావుగారి గొంతులో ఎంతో నిజాయితీ వినిపించింది. అది విని, నవ్వుతూ అన్నాడు విశ్వనాథం.

"అందుకే లోగడ మనవి చేశాను. మేం శాంతి పన్నాలు వల్లించక పోవచ్చు. కాని మాతో కలిసి పనిచేసే మా మిత్రుల భద్రతా, ఏమైనా ఐతే వాళ్ల కుటుంబాల గోడూ మా మనస్సులో మెదలవంటారా?"

"ఎక్స్‌క్యూజ్‌మీ" అన్నారు రావుగారు వెంటనే.

కాని ఆయన మొహం మీద ఒక శాంతిరేఖ వెలిసింది. తరువాత కొద్దిసేపట్లోనే విశ్వ నాథం శలవు తీసుకున్నాడు.

దాదాపు విశ్వనాథం చెప్పినట్లే ఆ రాత్రి సమ్మెలో ఒక్కొక్క ఘట్టం జరగసాగింది. అయితే వాటిని పట్టాభిగారు దగ్గరుండి జరిపించలేదు. వారి సేవకులు వంద–మందున్నారు – వారి పనులు చూడడానికి.

సమ్మె ఆరంభం కావడానికి చాలా గంటలముందే ఫ్యాక్టరీ ఆవరణ పోలీసులతో నిండిపోయింది. రావుగారి బంగళాకు టీకి వెళ్లిన విశ్వనాథం రాత్రి ఏ వేళకూ ఇల్లు చేరలేదు. వెతకడానికి స్కూటర్ మీద వెళ్లిన మనిషికి పట్టాభిరామయ్య బంగళా ముందు పహారా కనిపించింది. ఈ భోగట్టా చెప్పడానికి ఎన్ని చోట్ల వెతికినా కుంచాలయ్య కనిపించలేదు.
సమ్మె సరిగ్గా పన్నెండు గంటల కారంభం. మిల్లు గేటుముందు అరుపులూ, పరుగులూ. అనుభవం లేని మేనేజర్ ఆఫీసు గదిలో వెర్రెత్తి తిరుగుతున్నాడు. యజమాని కోసం యెన్నిచోట్ల ప్రయత్నించినా ఆయన జాడ తెలియడం లేదు.
బంగళా చుట్టూ పహారాలతో మిసెస్ పట్టాభికి నిద్ర పట్టడం లేదు. ఆ రాత్రే ఏంవిటి – అంతకు ముందు రాత్రి కూడా ఆమె నిద్రపోలేదు. ఆ ఫోన్ కాల్ –

పట్టాభి మండిపడ్డం – మంటలు రేగి ఒళ్లల్లా దహించుకుపోయింది.

దానికి తోడిప్పుడు నిమిష నిమిషానికీ ఓ ఫోన్ కాల్ వస్తోంది. 'వారు ఇంట్లో లేరు' 'ఎటు వెళ్లారో తెలీదు' 'ఎప్పుడొస్తారో చెప్పలేను' 'ఒకవేళ రాకపోవచ్చు' ఆమెకు పట్ట రాని మంటగా వుంది.

అక్కడ సన్ ఎన్ సేండ్ లో జ్వాలాకుమారి వుండే పదమూడో నెంబరు గదికి నిద్ర ముంచుకొచ్చే కళ్లతో బేరర్లు మెట్లెక్కి దిగుతూ తమ భాగధేయాన్నీ, పైవారి భాగధేయాన్నీ పదే పదే తిట్టుకుంటున్నారు.

లోపల పట్టాభిరామయ్య – ఆజాను బాహువు – అంత విగ్రహానికీ మొలమీద నూలుపోగైనా లేదు. దిసమొలతో ఆయన ఒళ్లో కూచున్న పద్దెనిమిదేళ్ల పిల్ల, తన ఎర్రని లేత పెదవులతో, మగతగా ఆ మోటు మానిసి పెదవులు వెతుకుతోంది.

పిల్ల సరే – తాగిన ఖరీదైన స్కాచ్ విస్కీ మత్తువల్ల ఏ స్పర్శ జ్ఞానమో తప్పితే తక్కిన సమస్త జ్ఞానాలూ పట్టాభిరామయ్యలో ఎప్పుడో హరించుకు పోయేయి. ఇంకాస్త ఐతే చీకటి – ఆ చీకటి ఆయనకొద్దు. వెలుగులోకి రావడానికి భయం, వెలుగు కనిపిస్తేనే భయం – అక్కడే వుంది అతనికి శాంతి.
ఏ శాంతిని ఐతే లోకం ఘనంగా కీర్తిస్తుందో ఆ శాంతి, పట్టాభిరామయ్య అంతటి వ్యక్తిని కూడా సుఖశాంతుల కోసం అలాంటి స్థితికి తరుముతోంది. అట్టిదాన్ని కొందరు కీర్తించవచ్చు కాని అందరూ కీర్తించలేరు. మంచివాడు సరే సరి – దానిని చిన్నాభిన్నం చేస్తాడు – మన మందలింపులూ, శాపాలూ అంటారా, అవి మనవద్దనే పదిలంగా వుంటాయి.

(Reprinted with the permission of the author)